ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ : 9440897445, 8074636674

గురువారం 20 ఆగస్టు 2026 | Thursday 20 August 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 131 | Vol.No 28 Issue No .131 | www.visionandhra.in




## ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

- బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి
- వారి ఆదాయం పెంచడంలో భాగస్వామ్యం కావాలి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి సూచన

హైదరాబాద్,ఆగస్టు 19 : అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. ఓ-ఘూఓఇలకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం మిగతా 2లో..

## ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి..

- ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలి
- కేంద్ర ప్రభుత్వానివి కుట్రపూరిత రాజకీయాలు
- ఎస్ఐఆర్ పేరుతో భారీగా ఓట్ల తొలగింపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణ





ఖమ్మం,ఆగస్టు19 : గ్రామీణ ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ పల్లెల ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా కూసుమంచి మండలం క్యాంప్ కార్యాలయంలో అర్హులైన 12 మంది దివ్యాంగులకు వందశాతం సబ్సిడీపై మూడు చక్రాల మోటార్ వాహనాలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నాను. రూ. 61.76 కోట్లతో పల్లెగూడెంలో సీసీ, బీటీ రోడ్ల తో పాటు వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పల్లెగూడెంలో ప్రభుత్వ మిగతా 2లో..

## కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

- రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆమోదం



న్యూఢిల్లీ,ఆగస్ట్19 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్‌లో రహదారి ప్రాజెక్టు. కేంద్ర మిగతా 2లో..

## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు..

### విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

- దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందన్న ఖర్గే
- ప్రముఖ విద్యాసంస్థలన్నీ ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆరోపణ
- కేంద్రం నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపై నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శ



న్యూఢిల్లీ,ఆగస్ట్19 :ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందని, ప్రముఖ విద్యాసంస్థలన్నీ క్రమంగా ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆయన ఆరోపించారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ మిగతా 2లో..

## 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం



- ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి
- పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి
- అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం

హైదరాబాద్,ఆగస్టు19 : నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి మిగతా 2లో..

## బాంబు పేల్చిన సుష్మితా పటేల్

- సీఎం రేవంతా..పొంగులేటా...అర్థం కావడ లేదు
- కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వకుంటే ఒంటరిపోరాటం
- తెలంగాణ రాజకీయాల్లో కాక రేపిన కొండాసురేఖ తనయ
- వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి మల్లు రవి



వరంగల్,ఆగస్ట్19 : మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మితా పటేల్ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ కాక రేపుతున్నాయి. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ సంచలన ప్రకటన చేశారు. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పరకాల నియోజకవర్గ రాజకీయాలపై సుష్మితా పటేల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ రెడ్డి వ్యవహారశైలిలో మార్పు వచ్చిందని అన్నారు. 'పొంగులేటి ముఖ్యమంత్రా.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా? అసలు ఎవరు సీఎం అనేది అర్థం కావడం లేదు' అని సుష్మితా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు తన తండ్రి కొండా మురళీ కూడా సహకరించారని సుష్మితా పటేల్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే సమయంలో కొండా మురళీ సహకారం ఉందని అన్నారు. అందుకు ప్రతిఫలంగా కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని, అయితే ఆ మిగతా 2లో..

## పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

- సీఎం రేవంత్ ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యాఖ్యలు
- సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ



హైదరాబాద్,ఆగస్ట్19 : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు మిగతా 2లో..


## ఫిలిప్పీన్స్‌లో ఎన్నారై అడ్వైజరీ కమిటీ పర్యటన

- మనీలాలో కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతోనూ భేటీ
- ఉత్తమ వలస విధానాలపై చర్చలు
- గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానాల కోసం కృషి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడి మిగతా 2లో..



## గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కోకొల్లలు

- అనర్హులతో పేపర్లు దిద్దించిన ఘనత ఆనాటి వైసిపిది
- ప్రైవేట్ ఏజెన్సీలకు పేపర్లు దిద్దే బాధ్యత అప్పగింత
- ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులకు అప్పగింత
- అసెంబ్లీలో ఆనాటి దుర్మార్గాన్ని ఏకరువు పెట్టిన చంద్రబాబు



అమరావతి,ఆగస్ట్19 : వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో భయంకరమైన అక్రమాలు జరిగాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకున్నారని.. పేపర్లను పూర్తిగా అనర్హులతో దిద్దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అక్రమాలపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. 'గ్రూప్-1పై నివేదికలు చూస్తే భయంకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. పేపర్లు దిద్దే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమే తప్పు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఏ పనీ చేయకూడదు. పేపర్లు దిద్దడంలో ప్రతి దశలోనూ నిబంధనలు ఉల్లంఘించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించారు. ఈ మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌లో వివరాలు షేర్ చేసుకున్నారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దే అధికారం వీరికి ఎవరిచ్చారని నిలదీసారు. మార్కులు తగ్గించడం.. పెంచడం ఇష్టం వచ్చినట్లు చేశారు. సీఎం ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు సెక్రటరీ పోస్టు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేశారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు. తొలుత హైదరాబాద్‌లో, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించారు. హైదరాబాద్‌లో ఎవాల్యుయేషన్ చేసిన వారిలో 25 మంది అనర్హులు. హాయ్‌లాండ్‌లో ఎవాల్యుయేషన్ చేసిన 66 మందీ అనర్హులే. మాన్యువల్ ఎవాల్యుయేషన్ జరగాలి.. డిజిటల్ మూల్యాంకనం వద్దని హైకోర్టు చెప్పింది. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారని ఆనాటి అక్రమలాపై చంద్రబాబు ఏకరువు పెట్టారు. ఫ్రీలాన్సర్ మహంకాళి మిగతా 2లో..

## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం....

- అసెంబ్లీలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన లోకేశ్
- ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుపై నిబంధనలను సరళతరం చేస్తూ అసెంబ్లీలో బిల్లు
- భూమి నిబంధన 50 నుంచి 10 ఎకరాలకు తగ్గింపు
- కనీస పెట్టుబడి నిబంధన తొలగింపు, ఎండోమెంట్ ఫీజు రూ. 5 కోట్లకు కుదింపు
- రాష్ట్రంలో 'విష్ణు మహిళా విశ్వవిద్యాలయం' ఏర్పాటుకు ఆమోదం
- 60 రోజుల్లోనే ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో వర్సిటీలకు అనుమతులు



అమరావతి,ఆగస్ట్19 : ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రక్రియను సరళతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ మేరకు 'ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026'ను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. నిబంధనలను సరళతరం చేసి, ఉన్నత విద్యా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. కేంద్రంలో ప్రధాని మిగతా 2లో..

## ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా



అమరావతి,ఆగస్ట్19 : కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే మిగతా 2లో..

## ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

ముఖ్యమని అన్నారు. అఉ+ుఓ+ూఇ కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

## కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్‌పూర్-భద్రక్ 4వ లైన్‌కు రూ.3,352 కోట్లు, భద్రక్-హరిదాస్‌పూర్ 4వ లైన్‌కు రూ.1,583 కోట్లు, కటక్-పారాదీప్ 3, 4వ లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించార. రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. లాగే బిహార్‌లోని ముజఫర్‌పూర్-సీతామర్హి-సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.

## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు..

పరీక్షల కుంభకోణాలే స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా యువత లేవనెత్తిన అసలైన సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని ఖర్గే విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ 'విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్'ను రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే అయోధ్య రామాలయం విరాళాల చోరీ వివాదంపై స్పందిస్తూ, నిధుల గోల్‌మాల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

## 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 22/ఎభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ది పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.

## బాంబు పేల్చిన సుష్మితా పటేల్

హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఇక్కడి మైసమ్మపై ప్రమాణం చేయగలరా? అని సుష్మితా పటేల్ సవాల్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ మధ్య పోటీ జరుగుతోందని వ్యాఖ్యానించారు. రేవూరి ప్రకాశ్ రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని సుష్మితా పటేల్ ప్రశ్నించారు. దమ్ముంటే రాజీనామా చేయించి ఇప్పుడే ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. తమ ఇలాఖాకు వచ్చి తమతో ఎందుకు పెట్టుకుంటున్నారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన అవినీతిపై ఇప్పటివరకు రూ.200 కోట్ల వ్యవహారాన్ని మాత్రమే బయటపెట్టానని సుష్మితా పటేల్ ఆరోపించారు. తనపై కౌంటర్ ఇస్తే మరిన్ని విషయాలను బయటపెడతానని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల సమయానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారో, ఉండరో కూడా సందేహమేనని సుష్మితా పటేల్ వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పూర్తి వివరాలు తెప్పించుకున్న తర్వాత ఆమెపై పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## సినిమా టిక్కెట్లపై ప్రభుత్వం కీలక ఆదేశాలు

- థియేటర్ స్క్రీన్స ఆధారంగా రేట్లు
- ఐదు షోలకు అనుమతి..ఆదాయంలో కార్మికులకు వాటా

హైదరాబాద్,ఆగస్ట్19 : తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై ప్రభుత్వం కీలక జీవో జారీ చేసింది. కొత్తగా స్పెషల్ థియేటర్స్ కేటగిరీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 7.1 సౌండ్, 2కె/4కె స్క్రీన్లకు స్పెషల్ కేటగిరీ వర్తించనుంది. ప్రతి థియేటర్‌లో 25 శాతం నాన్-ప్రీమియం సీట్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు 5 షోలకు అనుమతి ఇచ్చింది. చిన్న సినిమాలకు ప్రతి రోజు ఒక షో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. రూ.100 కోట్లు పైబడిన సినిమాలకు ప్రభుత్వం సూపర్ హై బడ్జెట్ హోదా కల్పించింది. తొలి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం కల్పించింది. టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత శాతాన్ని కార్మికుల సంక్షేమ నిధికి విరాళంగా ఇవ్వాలని షరతు పెట్టింది. కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి వరకు విరాళం తప్పనిసరి చేసింది.

# ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి..

మరియు అసైన్డ్ భూములను ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలి. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడం జరిగింది. అదేవిధంగా గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షల నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సభలో పింఛన్లు కావాలని అడిగిన మహిళలకు నెల 31వ తేదీలోగా అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఎస్‌ఐఆర్ అనే పక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు ఎస్‌ఐఆర్ అనే భూతాన్ని చూపి భారీగా ఓట్ల తొలగింపుకు తెరలేపిందన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పీసీసీ సమావేశంలో ఏఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కో ఇన్చార్జి సచిన్ సావంత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ ,పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివసా రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుంచి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టడమే కాకుండా, మరో 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారు. కుట్రలను తిప్పికొట్టేందుకు రాబోయే 4-5 రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కోకొల్లలు

రఘురామ్‌ను నియమించారు. 166 మందిలో 50 మంది డిగ్రీ లెక్చరర్లను వినియోగించారు. గ్రూప్-1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో తప్పులు దిద్దకూడదు. కానీ.. 55 చోట్ల తప్పులు సరిచేశారు. 49వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు రాసిన లెక్చరర్‌ను కూడా పేపర్లు దిద్దేందుకు పిలిచారు. కోర్టులను పక్కదారి పట్టించేందుకు అధికారులతో తప్పుడు అఫిడవిట్లు వేయించారు. ఖర్చుల కోసం రూ.1.14 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటైందన్నారు. వైకాపా హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి.. పైరవీలకు దూరంగా ఉండాలి. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాల్సిందేని చంద్రబాబు అన్నారు. చేసింది సరైనదే అని చెప్పే దమ్ము, ధైర్యం వైకాపా నేతలకు ఉందా? ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రతిభావంతులు నష్టపోతారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదని సీఎం చంద్రబాబు అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం ఏపీపీఎస్సీ ఏర్పడిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సర్వీసుల్లోకి వచ్చే అధికారులను గ్రూప్-1 పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని, ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. అలాంటి పరీక్షల్లో గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు.ప్రజలు, ఉద్యోగార్థులు ఈ అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ జవాబుదారీతనానికి వేదిక అని, ఇక్కడి నుంచే ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని తాను చాలాసార్లు చెప్పానని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోని వివిధ వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం పోయేలా గత పాలకులు వ్యవహరించారని విమర్శించారు.

## జల్సాల అలవాటుతో ప్రిన్సిపల్ ఇంట్లో దొంగతనం ప్లాన్

- రూపారెడ్డి గుర్తు పట్టడంతో కత్తితో పొడిచి హత్య
- డబ్బు, సెల్‌ఫోన్ తీసుకుని పరార్
- వివిధ కోణాల్లో పరిశీలించి ఇద్దరు విద్యార్థుల పట్టివేత
- హత్యకేసును వివరించిన ఎస్పీ శరత్ చంద్ర

నల్గొండ,ఆగస్ట్19 : సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు చేసిన ఘాతుకమని వెలిపారు. ఆ ఇద్దరు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది. రూపారెడ్డి నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారని ఎస్పీ3 వివరించారురు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం అని ఎస్పీ వివరించారు.

## ఏ పి ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లుకు శాసనసభ ఆమోదం

- సభలో బిల్లును ప్రవేశపెట్టిన న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

అమరావతి, ఆగస్టు19 : ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లు-2026కు శాసనసభ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన శాసనసభ సమావేశాలు మూడవ రోజున స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రవేశపెట్టారు. మంత్రి ఫరూక్ ప్రవేశపెట్టిన బిల్లులోని ముఖ్యాంశాలను ప్రశంసిస్తూ వాటికి పూర్తి మద్దతు తెలుపుతూ బిల్లును ఆమోదించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. ప్రతిపాదనలకు సభ్యుల ఆమోదంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.బిల్లును ప్రవేశపెట్టినప్పుడు మంత్రి ఫరూక్ శాసనసభలో బిల్లు ముఖ్య ఉద్దేశంతో పాటు అందుబాటులోకి వచ్చే సులభతరమైన విధానాలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లుతో రాష్ట్రంలో విశ్వాస-ఆధారిత నియంత్రణ చట్రాన్ని పెంపొందించుటకు, పౌరుల యొక్క జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుచుటకు, మరియు కార్యకలాపాల నిర్వహణను వేగవంతం చేయుటను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం సూచించిన నియంత్రణల సడలింపు, అనుసరణ భారాన్ని తగ్గించే సంస్కరణలను అమలు చేయడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని మంత్రి వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం-1999 క్రింద ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అంతర్జాతీయ ప్రమాణాలు మరియు మార్గదర్శకాలు ఆధారంగా ఉండేలా చేసినట్లు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు సంబంధించిన ప్రస్తావనలను తొలగించినట్లు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల పునరుద్ధరణ కోసం థర్డ్-పార్టీ ఫైర్ ఆడిట్ ఏజెన్సీలు అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి, వాటి ఎంపానెల్మెంట్కు సంబంధించిన అర్హతలు, ప్రమాణాలు, విధులు, పర్యవేక్షణ మరియు క్రమశిక్షణా నిబంధనలను చేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు.ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ సింగిల్ విండో క్లియరెన్స్ చట్టం- 2002 కింద పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ, స్పష్టమైన అధికారాలతో పాటు తప్పనిసరి ఎస్కలేషన్ అథారిటీతో కూడిన రాష్ట్ర మరియు జిల్లా కమిటీలతో కూడిన రెండు అంచెల సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించామని వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ చట్టం- 2017 లో సేవలు తిరస్కరించబడినప్పుడు లేదా నిర్ణీత గడువులో అందించనప్పుడు, దరఖాస్తుదారులు తామే స్వయంగా అప్పీల్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండా ఆటో-అప్పీల్ విధానం ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఏదైనా సేవ తిరస్కరించబడినా లేదా నిర్ణీత గడువులో అందించబడకపోయినా, అప్పీల్ స్వయంచాలకంగా దాఖలైనట్లుగా పరిగణించబడుతుందన్నారు. అప్పీలేట్ అథారిటీ 21 రోజుల్లోపు ఆ అప్పీల్‌ను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే సేవను అందించమని ఆదేశించడంతో పాటు, పరిహారం చెల్లించాల్సిందిగా కూడా ఆదేశించవచ్చునని పేర్కొంటూ మంత్రి ఫరూక్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును ప్రవేశపెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

## ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృధా

- భూసేకరణలో బాధితులను పట్టించుకోరా
- కళ్యాణలక్ష్మి విచారణపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్,ఆగస్ట్19 : ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

## పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకో వైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది.

## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం....

నరేంద్ర మోదీ స్ఫూర్తిగా తీసుకొచ్చిన 'జన్ విశ్వాస్' విధానంలో భాగంగానే ఈ సవరణలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అన్ని రంగాలకు విస్తరింపజేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఉన్నత విద్యా రంగంలో నియంత్రణలను సులభతరం చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వర్సిటీల సంఖ్య తక్కువగా ఉందని, ఈ సవరణల ద్వారా కొత్త సంస్థలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ బిల్లులో పలు కీలక సవరణలు ప్రతిపాదించారు. ప్రధానంగా, ప్రైవేటు వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని 50 ఎకరాల నుంచి సీఆర్డీఏ, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో 10 ఎకరాలకు, ఇతర ప్రాంతాల్లో 15 ఎకరాలకు తగ్గించారు. కనీస పెట్టుబడి నిబంధనను పూర్తిగా తొలగించి, కేసును బట్టి నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకునేలా మార్పు చేశారు. ఎండోమెంట్ ఫీజును రూ.5 కోట్లకు పరిమితం చేశారు. బ్రౌన్‌ఫీల్డ్ వర్సిటీగా మారాలంటే యూజీసీ నిబంధనల ప్రకారం కనీసం 3.01 సీజీపీఏ తప్పనిసరి చేశారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో రెండో మహిళా విశ్వవిద్యాలయంగా 'విష్ణు మహిళా విశ్వవిద్యాలయం' ఏర్పాటుకు మార్గం సుగమమైందని మంత్రి తెలిపారు. మా ప్రభుత్వ విధానం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని, దరఖాస్తుల ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేసేలా ఫాస్ట్ ట్రాక్ విధానాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ వంటి 22 పారిశ్రామిక క్లస్టర్లకు అనుగుణంగా వర్సిటీలలో పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా, పరిశ్రమలకు అనుసంధానంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే ఈ సవరణల ముఖ్య ఉద్దేశమని మంత్రి వివరించారు.

## ఫిలిప్పీన్స్‌లో ఎన్నారై అడ్వైజరీ కమిటీ పర్యటన

హైదరాబాద్,ఆగస్టు19 : తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం సభ్యులు బుధవారం ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలోని ఇండియన్ ఎంబసీని సందర్శించారు. తర్వాత మనీలాలోని కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతోనూ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ వలస విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిలిప్పీన్స్ దేశ వలస విధానాన్ని ఆ దేశ ఉన్నత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వలస విధానాన్ని అమలు చేస్తున్న ఫిలిప్పీన్స్ దేశంలో అమలులో ఉన్న విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇదే తరహా మెరుగైన వలస విధానాన్ని గల్ఫ్ కార్మికుల కోసం అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడించారు. మనీలాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అంబసడర్ హర్ష కుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ లతో వలస కార్మికుల విధానాల అంశాలపై కమిటీ సభ్యులు సుధీర్ఘంగా చర్చించారు. గల్ఫ్ కార్మికులను సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహా విధానాలను అమలు చేస్తామన్నరాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎన్నారై అడ్వైజరి కమిటీ ఫిలిప్పీన్స్ దేశంలో పర్యటిస్తోంది. ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు, లైజన్ ఆఫీసర్ ఆది కార్తీక్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

## టేబుల్‌పై డిఎంకె అవినీతి ఫైల్స్

- వాటిని అప్పడే తెరిచేలా చేయకండి
- తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు



చెన్నై,ఆగస్ట్19 : ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. వాటిని ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చోబెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను. ప్రజలకు కొంత మంచి జరగనివ్వండి' అని అన్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# సవాళ్లను స్వీకరిస్తేనే ప్రజలు ఆదరిస్తారు !

సవాళ్లను స్వీకరించకుండా..సమస్యలను పరిష్కరించకుండా ఎల్లకాలం పాలన సాగించడం సాధ్యం కాదు. ముఖ్యంగా ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకపోతే ప్రజలు నిరంతరాయంగా ఓటేస్తారని అనుకోవడం కూడా పొరపాటే. ఈ దేశంలో మహామహులను ఓడించిన చరిత్ర ఉంది. భారతీయ జనతాపార్టీ కూడా ఇప్పుడు అదే కోవలోకి వస్తుంది. ఇటీవల ఎర్రకోట మీదుగా ప్రధాని మోడీ చేసిన ప్రసంగంలో మహిళా రిజర్వేషన్ల గురించి ప్రస్తావించారు. దీనిపై ఎప్పుడో పార్లమెంట్ ఆమోదించినా, మళ్లీ ప్రధాని పదేపదే అదే విషయం ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇప్పుడున్న 542 లోక్‌సభ సీట్లకు మహిళా రిజర్వేషన్లు ప్రకటిస్తే ఎవ్వరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఒకే సమస్యలను పదేపదే ఎత్తి చూపడం ద్వారా ప్రజల్లో కూడా విసుగు తెప్పిస్తుంది. ఇకపోతే డీలిమిటేషన్ కూడా రాజకీయ లబ్దికోసమే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ఈ క్రమంలో ఈ రెండు విషయాల్లో మొన్నటి పార్లమెంట్ సమావేశాల్లో గట్టెక్కించాలనుకున్న మోడీ ద్వయం వ్యూహం బెడిసి కొట్టిందనే చెప్పాలి. ఈ క్రమంలో త్వరలోనే యూపి, పంజాబ్ ఎన్నికలు రాబోతున్నాయి. ఇందుకోసమేనా అన్నట్లుగా బిజెపి కూడా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించు కుంది. కొత్తగా కొందరిని పార్టీలోకి తీసుకున్నారు. పార్టీని బలోపేతం చేయడం ద్వారా ముందుకు సాగాలని బిజెపి చూస్తోందనడానికి ఈ కూర్పు నిదర్శనంగా చూడాలి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో మార్పు వచ్చింది. అయితే ఇది చెప్పుకోదగ్గ రీతిలో లేదు. ఎందుకంటే ప్రజలు ఆశిస్తున్నది ఇది కాదు. వారు కోరుకుంటున్నది ఇలాంటి మార్పులు కావు. సమాజంలో వస్తున్న మార్పులపై స్పందించాల్సిన అవసరం ఉంది. దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత, విద్యార్థుల్లో ఆలోచనలు మారుతున్నాయి. జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలన్న ఆలోచనలకు అనుగుణంగా బిజెపిలో మార్పు కనిపించడం లేదు. పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం గురించి చర్చించడం లేదని అనిపిస్తోంది. ఎందుకంటే యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి. ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దేశంలో అనేకానేక సంస్కరణలు తీసుకుని వచ్చింది. మౌళికరంగంలో అనేక మార్పులు తెచ్చింది. దేశంలో అభివృద్ధిని పరుగులు పెట్టించింది. రోడ్డు, రైల్వే రంగాల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. ఎన్నడూ ఊహించని విధంగా పురోభివృద్ధి కనిపిస్తోంది. అయితే విమానయానరంగం అందనంత ఎత్తులో ఉంది. తిరుపతికి వెళ్లాలంటే భయపడే స్థితలో విమాన టిక్కెట్ రేట్లు పెరిగాయి. ం

విమయానయాన రంగాన్ని ప్రజలకు చేరువ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇక అన్నింటికి మించి విద్యా,వైద్యరంగాలు నీరుగారి పోతున్నాయి. చదువుల, వైద్యం ప్రజలు భరించలేనంత భారంగా మారాయి. వీటిపై కేంద్రం దృష్టి పెట్టడం లేదు. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు పట్టించుకోవాలి. అలాకాకుండా అభిజిత్ దీప్కేకు ఆప్‌తో సంబంధాలు ఉన్నాయని వాదించడం సరికాదు. యువతలో వచ్చిన ఆందోళనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. వారు ఏమి కోరుకుంటున్నారో అధ్యయనం చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసుకుంటున్నదన్నదే ముఖ్యం. కమలం పార్టీ బాగా విస్తరించిందని, తన కాళ్లమీద తాను నిలబడిందని, ప్రపంచంలో ఎవ్వరికీ లేని కార్యకర్తల బలం ఉందని విర్రవీగితే....ప్రజలు ఊదితే వచ్చే గాలిలో కొట్టుకు పోగలరు. పార్టీ వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది సభ్యులతో అవతరించిన బీజేపీ నిజానికి పటిష్టంగానే ఉందని ఒప్పుకోక తప్పదు. ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అయినా 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించింది. దీంతో ఎన్‌డిఎ బలంతో మళ్లీ పగ్గాలు చేపట్టింది. నిజానికి ఇదే ఓ హెచ్చరికగా బిజెపి తీసుకోవాలి. అలా కాకుండా ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వస్తోంది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. తిరుగులేని శక్తిగా ఎదిగిన తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నించగల శక్తి పార్టీలో ఎవ్వరికీ లేకుండా పోయింది. మద్దతు ఇస్తున్న పార్టీల్లో టిడిపి సైతం ఎదిరించే స్థితిలో లేదు. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల నిరసన ఈ పరిణామాలపై ఆత్మావలోకనం చేసుకునేందుకు ఇదో మంచి అవకాశం. దశాబ్ద కాలానికి పైగా మోదీ ఒక రాజకీయ భావజాలాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పుడు కొంచెం దానినుంచి బయటకు వచ్చి ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడితో సహా అన్ని నియామకాల విషయంలో మోడీ ద్వయం పెత్తనమే సాగుతోంది. ఇప్పుడు కొత్త కార్యవర్గ కూర్పులోనూ అదే కనిపిస్తోంది. అయితే ఇది చాలదని గుర్తించాలి. ప్రజలకు మంచి చేసుకోవడానికి ఇంకా మంచిపనులు అనేక చేయాలి. ధరలను అదుపు చేయడం మొదలు, నిరుద్యోగ యువతను ఉపాధి, ఉద్యోగాల బాట పట్టించడం ముఖ్యం.

# ఇరాన్ క్షిపణి దాడులపై అరబ్ ఆగ్రహం

**- ఇరాన్‌తో వాణిజ్య బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటన**



న్యూఢిల్లీ,ఆగస్ట్19 : ఇరాన్‌తో అన్ని వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ ఈ చర్య తీసుకుంది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా... ఇరాన్‌తో అన్ని వాణిజ్య, వ్యాపార వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేశామని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హమెలీ తెలిపారు. మరో క్షిపణి ముప్పు గురించి దేశ ప్రజల్ని హెచ్చరిస్తూ ఫోన్ అలర్ట్ జారీ చేసిన దాదాపు రెండు గంటల తర్వాత యూఏఈ ఈ ప్రకటన చేసింది. 'ప్రస్తుత పరిస్థితి, క్షిపణి ముప్పు కారణంగా, వెంటనే ప్రజలు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సదరు ఫోన్ అలర్ట్‌లో పేర్కొంది. అయితే, ఆ అలర్ట్‌ను కొద్దిసేపటికే ఉపసంహరించారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి, ఇరాన్ దాడుల తీవ్రతను యూఏఈ ఎక్కువగా ఎదుర్కొంది. ఈ ప్రాంతంలోని మరే ఇతర దేశం కంటే ఎక్కువగా, దాదాపు 3,000 క్షిపణులు, డ్రోన్‌లు ఆ దేశంపై ఇరాన్ ప్రయోగించింది. గల్ఫ్‌లోని నౌకా రవాణాపై ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆరోపించగా, ఈ ఆరోపణను ఇరాన్ ఖండించింది. ఇరాన్ తమ దేశం వైపు క్షిపణిని ప్రయోగించిందన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వాదనను ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ ఖండించారు. ఈ వాదన ప్రాంతీయ విశ్వాసానికి, భద్రతా ప్రయత్నాలకు హానికరమని ఆయన పేర్కొన్నారు.

# టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బిఆర్‌ఎస్ పిలుపు

## హరీష్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్‌ల హౌజ్ అరెస్ట్

హైదరాబాద్,ఆగస్ట్19 : మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేట్‌లోని హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ సందర్శనకు హరీశ్ రావు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టించారు. అసెంబ్లీ ఎన్నికల సమయానికి అంటే ఏడాది కాలంలోనే అన్ని దవాఖానల నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయి. గత సంవత్సరమే మూడు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ప్రస్తుతం సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సం చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్ రావు హాస్పిటల్ సందర్శనకు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. నత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది.



అలాగే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సనత్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని బీఆర్ఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, అడ్డుకునేందుకు తమను హౌస్ అరెస్ట్‌లు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్‌లకు చెందిన ముఖ్య నాయకులను పోలీసులు ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

# కశ్మీర్‌లోకి 10వేల మంది ఉగ్రవాదుల తరలింపు

**- నసీర్ మాద్నీ సంచలన వ్యాఖ్యలు**

లాహోర్,ఆగస్ట్19 : పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని బహావల్‌నగర్‌లో ఆగస్టు 14న జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన నసీర్ మాద్నీ కశ్మీర్ గురించి పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఉగ్రసంస్థ ఎల్ఈటీ చీఫ్ హఫీజ్ సయీద్ కశ్మీర్‌లోకి 10 వేల మంది ఉగ్రవాదులను పంపించినట్టు చెప్పాడు. దీంతో, కశ్మీర్‌లో ఉగ్ర నెట్‌వర్క్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం అవుతోంది. హఫీజ్ సయీద్ సారథ్యంలోని లష్కరే తొయిబా భారత్‌లో అనేక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి హఫీజ్‌పై పలు కేసులు నమోదయ్యాయి. 26/11 దాడుల్లో మంది పాక్ ఉగ్రవాదులు సముద్రమార్గంలో ముంబైలోకి ప్రవేశించి నాలుగు రోజుల పాటు మారణ హోమం సృష్టించారు. ఈ ఉగ్రవాద దాడిలో 166 మంది మరణించగా 300 మంది గాయపడ్డారు. ఇక గతేడాది పహల్గాం దాడిలో 26 మంది సాధారణ పౌరులు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి జమ్మూలోని కోర్టు హఫీజ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఐక్యరాజ్య సమితి, అమెరికా కూడా ఎల్ఈటీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి.

# మండలిలో డిఎస్సీపై వైసిపి వాయిదా తీర్మానం

**- తిరస్కరించిన ఛైర్మన్..కాసేపు మండలి వాయిదా**




అమరావతి,ఆగస్ట్19 : ఏపీ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. బుధవారం శాసనమండలిలో మెగా డీఎస్సీపై వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ వాయిదా తీర్మానాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో చైర్మన్ పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనతో శాసనమండలిలో గందరగోళం నెలకొంది. డీఎస్సీపై చర్చ పెట్టాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పోడియాన్ని చుట్టుముట్టి ఆ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మెడలో నల్ల కండవాలతో ఆ పార్టీ సభ్యులు సభకు వచ్చారు. వైసీపీ సభ్యులు ఆందోళనతో ఏపీ శాసన మండలిని చైర్మన్ కాసేపు వాయిదా వేశారు. వైసీపీ సభ్యులు సభను గౌరవించటం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. చైర్మన్ సభను ఆర్డర్‌లో పెట్టాలని సూచించారు. చైర్మన్ టేబుల్‌ను కొడుతూ ఎందుకు నినాదాలు చేస్తున్నారని ప్రశ్నించారు. సభా మర్యాద కాపాడాల్సిన బాధ్యత సభ్యులపైనా ఉందని తెలిపారు. మనోహర్ వ్యాఖ్యలపై చైర్మన్ కొయ్యే మోషేను రాజు అసహనం వ్యక్తం చేశారు. సభా నిర్వహణ, నిబంధనల గురించి మీకు బాగా తెలుసు అని అన్నారు. వారిపై ఎలాంటి చర్యలు ఎలా తీసుకోవాలో మీకు తెలుసునని చెప్పారు. సభ సంప్రదాయాల ప్రకారం జరగాలని ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జగన్ హయాంలో కూడా మీరు చైర్మన్‌గా వ్యవహరించారని అన్నారు. రెడ్ లైన్ గీసి విపక్షాల వాళ్లు దాటి వస్తే సస్పెండ్ చేశారని ప్రస్తావించారు. ఇప్పుడు కూడా అలాగే చేసేందుకు మీకు అధికారాలున్నాయని తెలిపారు. మూడు రోజులుగా సభకు అంతరాయం కలిగిస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని నిలదీశారు. చైర్మన్‌ను కించపరచాలనే ఆలోచన తమకు లేదని.. ఆయనకు పవర్స్ ఉన్నాయని చెప్పారు.

# ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యకేసు

**- పాఠశాల విద్యార్థులే హంతకులుగా నిర్ధారణ**



నల్గొండ,ఆగస్ట్19 : కొండమల్లెపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి హత్య ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నెల 11న జరిగిన ఈ హత్య కేసుకు సంబంధించి పోలీసులు మిస్టరీని ఛేదించారని సమాచారం. ఈ దారుణానికి పాల్పడింది అదే పాఠశాలలో చదివిన వంశీ, అనిల్ అనే విద్యార్థులే అని విచారణలో తేలినట్లు సమాచారం. డబ్బుల కోసం ఆశపడే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. హత్య అనంతరం నిందితులు గోవాకు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఈ కేసులో విద్యార్థుల ప్రమేయం ఉండటం స్థానికంగా దిగ్భ్రాం÷-రతిని కలిగించింది. సుమారు 80 మందిని విచారించిన అనంతరం ఆ విద్యార్థులే ఈ దారుణానికి పాల్పడ్డారని గుర్తించినట్లు సమాచారం. రూపారెడ్డి హత్య అనంతరం ఆ విద్యార్థులు సుమారు రూ.4 లక్షల నగదు చోరీ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదం

**- అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో 9మంది మృత్యువాత**

**- మృతులంతా చికిత్స కోసం వచ్చిన బంగ్లాదేశీయులుగా గుర్తింపు**



కోల్‌కతా,ఆగస్ట్19 : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని మిర్జా గాలిబ్ వీధిలో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో 9 మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి 1.45 నిమిషాలకు ప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బంది తో పాటు పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. దట్టమైన పొగ కమ్ముకోవడం వల్ల పై అంతస్తులకు చేరుకోవడానికి అగ్నిమాపక సిబ్బంది ఇబ్బందిపడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో ఓ చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో అర్ధరాత్రి 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పలువురు చిక్కుకుపోయి మరణించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారందరూ బంగ్లాదేశీయులేనని అగ్నిమాపక శాఖ తెలిపింది. మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం వారు కోల్‌కతాకు వచ్చారని అధికారులు తెలిపారు. ఏసీ పేలడంతో మూడో అంతస్తులో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఘటనకు గల కారణం ఇంకా వెల్లడించలేదు. మంటలు చెలరేగగానే హోటల్‌లోని కొందరు బయటకు పరుగుతీశారు. అగ్నికీలలు చుట్టూ ఉన్న ఇళ్లవైపు వ్యాపించడంతో ప్రజలు హాహాకారాలు చేశారు. ఘటన గురించి తెలియగానే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగు ఫైర్ ఇంజన్ల సాయంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. దట్టమైన పొగ వ్యాపించడంతో సహాయ కార్యక్రమాలకు కాస్త అంతరాయం ఏర్పడిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం బిర్భూమ్ జిల్లాలోని ఓ హోటల్ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మరణించగా పలువురు గాయపడ్డారు.

# డ్రగ్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు

## ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్



హైదరాబాద్,ఆగస్ట్19 : హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు



న్యూఢిల్లీ,ఆగస్ట్19 : భారత్‌లో ఈ వారం మొదటి నుంచీ బంగారం ధరలు ప్రతి రోజూ ఓ మోస్తరు స్థాయిలో పెరుగుతూనే ఉన్నాయి. యూఎస్ ఫెడ్ ప్రామాణిక వడ్డీ రేటు పెరగదన్న అంచనాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఆగస్టు 19) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,900గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,42,910 వద్ద కొనసాగుతోంది.

# రాయదుర్గం పోలీసులకు కోర్టు నోటీసులు




హైదరాబాద్,ఆగస్ట్19 : పోక్సో కేసులో నిందితుడిని వేధించి చిత్రహింసలకు గురిచేశారన్న ఆరోపణల నేపథ్యంలో రాయదుర్గం పోలీసులకు రాజేంద్రనగర్ కోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్ సమయంలో నిందితుడి ఒంటిపై గాయాలను న్యాయవాది కోర్టుకు చూపించారు. దీంతో రాజేంద్రనగర్ కోర్టు తక్షణమే నిందితుడిని విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. నిందితుడిని వేధింపులకు గురిచేసిన అంశంపై షోకాజ్ నోటీసులు జారీచేసింది. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని రాయదుర్గం పోలీసులను కోర్టు ఆదేశించింది. నిందితుడి రిమాండ్ రిజెక్ట్ చేస్తూ బెయిల్ మంజూరు చేసింది.

# నోటీసులు జారీకి చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సి.సుదర్శన్ రెడ్డి**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19,(విజన్ ఆంధ్ర) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సి.సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా ఎన్యువరేషన్ ఫారాలలో పొందుపరిచిన వివరాలలో వ్యత్యాసం ఉన్న అనమలిస్ జాబితాలో గల వారికి నోటీసులు జారీ ప్రక్రియను చేపట్టి సంబంధిత ఓటరుకు అందించి వారి సంతకం తీసుకోవాలని తెలిపారు. నోటీసులో విచారణ ప్రదేశం, తేదీ ఉండాలని, నిర్ణీత గడువులోగా నోటీసుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల ద్వారా నోటీసులు అందించి సరైన ఆధారాలతో విచారణ ప్రదేశానికి ఓటర్లు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 2 నియోజకవర్గాలలో సుమారుగా 94 వేల మంది అనమలిస్ ఓటర్లు ఉన్నారని, వారికి ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం.



నల్లబెల్లి మండల ప్రజల సౌకర్యార్థం జనతా ట్రస్ట్, శంకర ఐ ఫౌండేషన్ ఇండియా, శ్రీ కాంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడుతుంది. ఈ శిబిరంలో కంటి సంబంధిత సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు చికిత్స మరియు తదుపరి వైద్య సేవలకు మార్గదర్శనం అందించబడుతుంది.

సుమంగళి ఫంక్షన్ హాల్, నల్లబెల్లి

తేదీ: 20-08-2026 ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకుకంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు మరియు అవసరమైన వైద్య పత్రాలు వెంట తీసుకురావాలి.9949963083 । 9908315974 । 9908422162 ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించగలరని నిర్వాహకులు జనత ట్రస్ట్ చైర్మన్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు.

# బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు

**- నటి నిధి అగర్వాల్‌కు ఇడి ప్రశ్నలు**



హైదరాబాద్,ఆగస్ట్19 : బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌కు సంబంధించిన కేసులో సినీ నటి నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన విచారణలో ఆమె ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ప్రమోషనల్ కార్యక్రమాలకు సంబంధించి కుదుర్చుకున్న కాంట్రాక్టులు, వాటి కాలపరిమితి, ప్రచారం కోసం అందించిన కంటెంట్, సోషల్ మీడియా లేదా ఇతర వేదికల ద్వారా నిర్వహించిన ప్రమోషన్స్‌పై కూడా ఈడీ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇక బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు నిధి అగర్వాల్‌కు అందిన రెమ్యునరేషన్‌పై కూడా ఈడీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఒక్కో ప్రమోషన్‌కు ఎంత మొత్తంలో పారితోషికం తీసుకున్నారు, ఆ మొత్తాలు ఏ విధంగా చెల్లించబడ్డాయి, ఎవరి నుంచి చెల్లింపులు వచ్చాయి వంటి అంశాలపై అధికారులు వివరాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు లేదా వారికి సంబంధించిన వ్యక్తులు నిధి అగర్వాల్ బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసిన డబ్బు లావాదేవీలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆ చెల్లింపులు ప్రమోషనల్ కాంట్రాక్టులకు సంబంధించినవేనా, వాటికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ జరిగినట్లు తెలుస్తోంది.

# దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ఖమ్మం,ఆగస్ట్19 : దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో బుధవారం అర్హులైన 12 మంది లబ్దిదారులకు వందశాతం సబ్సిడీపై త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల, ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగాలు కల్పించాలి

**- అఖిల భారత యువజన సమాఖ్య డిమాండ్**

ఏలూరు, ఆగస్టు 19 : అఖిల భారత యువజన సమాఖ్య అధ్యర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ విధానాల కారణంగా యువత నిరుద్యోగం, ఉపాధి, వలసలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఏలూరు జిల్లా కన్వినర్ రాజు ఆందోళన వ్యక్తం చేసారు . ప్రతి సంవత్సరం కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు, మరోవైపు ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పోటీ పరీక్షల్లో జాప్యం, పేపర్ లీకులు, పరీక్షల రద్దు, నియామక ప్రక్రియలో అవకతవకల వల్ల నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన జాబ్ క్యాలెండర్, 4 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, కొత్త పరిశ్రమల ఏర్పాటు వంటి హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేసారు. మరోనేత కురెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి, ఎంఎస్ఎంఇ రంగాన్ని బలోపేతం చేసి స్థానిక యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలనీ, పేపర్ లీకులు, పరీక్షల అవకతవకలను అరికట్టి నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, యువతకు ఉపాధి హక్కుకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని డిమాండ్ చేసారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏఐవైఎఫ్ మాజి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు మాట్లాడగా, కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య యువజన సమాఖ్య మాజీ నాయకులు భజంత్రి శ్రీనివాస్, నాగం అచ్చుత్, కొండేటి విక్రమ్,నవీన్, బి గిరి, సాయి, బ సురేష్, సిద్దు పాల్గొన్నారు.

# కన్నీటి సుడుల్లో పాలిటెక్నిక్ కలలు!!




**- 'శక్తి' సంస్కరణలా? విద్యార్థులపై సంకెళ్లా?**

**- కలల రెక్కలా? భవిష్యత్తుపై కాళరాత్రులా?**

**- అమ్మ కష్టానికి, నాన్న శ్రమకు విలువేదీ?**

**- నిరసన బాటలో డిప్లొమా విద్యార్థుల గుండెఘోష**

## తెలంగాణ 'డిప్లొమా శక్తి' స్కీమ్‌పై "విజన్ ఆంధ్ర" ప్రత్యేక గ్రౌండ్ రిపోర్ట్




**హైదరాబాద్, ఆగస్టు 19:**

నల్లబల్లపై రాసిన సూత్రాలు కాదు... పేద విద్యార్థి బతుకు పుస్తకంలో ఇంజినీర్ కావాలన్న కల. పదో తరగతి పూర్తికాగానే, ఇంటి పేదరికాన్ని జయించి చేతికో డిప్లొమా సర్టిఫికెట్ తెచ్చుకుంటే బతుకు గాడిన పడుతుందని నమ్మిన ఎన్నో మధ్యతరగతి గుండెలు ఇప్పుడు రోడ్డెక్కాయి. తెలంగాణ ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యారంగాన్ని సంస్కరిస్తూ, యువతలో నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో తెరపైకి తెచ్చిన 'శక్తి' (శక్తి – యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అనుసంధానం) స్కీమ్ ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఒకవైపు పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దే సంస్కరణ అని ప్రభుత్వం అంటుంటే, మరోవైపు మా మూడేళ్ల చదువు విలువను తగ్గించి, ఉన్నత విద్య అవకాశాలను దెబ్బతీస్తున్నారని విద్యార్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

### నాణేనికి ఒకవైపు!!

**'శక్తి' స్కీమ్‌తో ఆశించిన లాభాలు**

ప్రభుత్వ ఆలోచన ప్రకారం, సాంప్రదాయ విద్యకు అతీతంగా ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం.

**పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలు**

సెమీకండక్టర్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక రంగాల్లో నేరుగా ప్రాక్టికల్ ట్రైనింగ్ లభిస్తుంది.

**అప్రెంటిస్‌షిప్ అండ్ స్టైపెండ్**


కాలేజీలో చదువుతున్నప్పుడే విద్యార్థులకు ఆన్-జాబ్ ట్రైనింగ్ మరియు నెలవారీ ఉపకార వేతనం అందేలా నూతన వ్యవస్థ రూపకల్పన జరిగింది.

**తక్షణ ఉపాధి అవకాశాలు**

డిప్లొమా పూర్తి కాగానే ఐటీ, కోర్ ఇండస్ట్రీల్లో కార్పొరేట్ కంపెనీలకు సరిపోయే స్కిల్డ్ ప్రొఫెషనల్స్‌గా మారే అవకాశం ఉంటుంది.

### నాణేనికి మరోవైపు!!

**విద్యార్థుల గుండెకోత, క్షేత్రస్థాయి నష్టాలు**




"చేతిలో పార పట్టి శ్రమించే నాన్న.. రోజంతా కష్టపడే అమ్మ.. వాళ్ల కళ్లల్లో ఆనందం చూడాలని మూడేళ్లు రాత్రింబవళ్లు చదివాం. ఇప్పుడు మా డిప్లొమాకు ఏఐసిటిఈ గుర్తింపు లేకుండా చేస్తే, మా ఇంజినీరింగ్ కలేం కావాలి?" ఇది నిరసన బాట పట్టిన ఒక పాలిటెక్నిక్ విద్యార్థి వేదన.

**బీటెక్ లాటరల్ ఎంట్రీపై సందిగ్ధత**

డిప్లొమా తర్వాత నేరుగా బీటెక్ సెకండియర్ (ఈసిఈటి) ద్వారా వెళ్లే వెసులుబాటు ప్రమాదంలో పడుతుందనే భయం విద్యార్థుల్లో నెలకొంది.

**విద్యా ప్రమాణాలు - గుర్తింపు సమస్యలు**

టెక్నికల్ బోర్డు (ఎస్.బి.టిఈటి), ఏఐసిటిఈ వ్యవస్థల నుంచి సాంకేతిక విద్యను స్కిల్ కౌన్సిల్ పరిధిలోకి మార్చడం వల్ల జాతీయ స్థాయి గుర్తింపు తగ్గే ప్రమాదం ఉందని అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు.

**డిప్లొమా విద్య 'ఐటీఐ' స్థాయికి కుదింపు?**

మూడేళ్ల సమగ్ర ఇంజినీరింగ్ ఫౌండేషన్‌ను పక్కనపెట్టి, కేవలం ఒక సాధారణ లేబర్ స్కిల్ సర్టిఫికెట్‌గా మార్చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నైపుణ్యాల పెంపు (అప్ స్కిల్లింగ్) కాలానికి అవసరమైనదే, కానీ అది వేలాది మంది గ్రామీణ విద్యార్థుల ఉన్నత చదువుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకూడదు. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, డిప్లొమా గుర్తింపుకు ఎటువంటి భంగం కలగకుండా సంస్కరణలను అమలు చేయడమే ఈ సంక్షోభానికి సరైన పరిష్కారం.

**- గడ్డం సంతోష్ రాజ్**

**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# బిసిల పట్ల కట్టప్పలా మారిన జగన్

**బిసి రిజర్వేషన్లపై ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి**




అమరావతి,ఆగస్ట్19 : రాష్ట్రంలో బీసీల పాలిట జగన్మోహన్ రెడ్డి కట్టప్పలా వ్యవహరించి వెన్నుపోటు పొడిచి అన్యాయం చేశారని ఆదోని నియోజకవర్గం భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన బీసీ రిజర్వేషన్లపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 16,800 మంది బీసీలకు అవకాశం దక్కుతుందన్నారు. బీసీ వర్గీకరణ చేపట్టి రాజకీయ పదవులు అందరికీ అందేలా చూడాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం బీసీలను రాజకీయంగా వాడుకునేందుకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని జీవోలు జారీచేసి.. చివరికి 24 శాతానికి కుదించి తీవ్రంగా అన్యాయం చేశారన్నారు. నీతి ఆయోగ్ సూచనలు మేరకు ప్రత్యక్ష విధానంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించడం శుభ పరిమాణం అన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాం నుంచి బీసీల పట్ల తెలుగుదేశం పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆదోని పట్టణంలో రహదారులను విస్తరించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించాలని ఆదోని భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరారు. 1987 తర్వాత ఇప్పుడు 2025లో వంద అడుగుల వెడల్పుతో మాస్టర్ ఎ÷-లాన్ వచ్చిందన్నారు. దీనిని అమలు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించడం వల్ల పారదర్శకతతో పాటు అక్రమాలకు తావుండదన్నారు. గత వైకాపా పాలనలో ఆదోని పురపాలక సంఘంలో ఇద్దరు ఛైర్‌పర్సన్‌లను మార్చిన ఘనత ఆ పార్టీకే దక్కిందన్నారు. ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకొస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# త్యాగం మీది? అండ మాది

**- వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం**

**- నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**- ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు**



అమరావతి, ఆగస్ట్ 19 : వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ... నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. జూన్ 27న రూ.300కోట్లు అందించిన ప్రభుత్వం బుధవారం ముంపు బాధితులకు మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు శాసన సభ ఆవరణలో నిర్వాసిత కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కును అందజేశారు. ఇప్పటి వరకూ వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.518 కోట్లను పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మంచి చేసే ప్రభుత్వాలను గుర్తించాలని అన్నారు. భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచి పరిహారం అందించడం పట్ల నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.రూ.518 కోట్ల మేర పరిహారం అందజేతవెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నందుకు గానూ ఓటీఎస్ కింద 2,557 కుటుంబాలకు ప్రభుత్వం రూ.318 కోట్ల మేర పరిహారం ఇప్పటికే చెల్లించింది. మరో 1,600 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.200 కోట్లు పరిహారానికి సంబంధించి చెక్కును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాసితులకు అందించారు. దీంతో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం కింద 4,157 కుటుంబాలకు రూ.518 కోట్లను ప్రభుత్వం చెల్లించినట్టైంది. నిర్వాసితుల కోసం 7 పునరావాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వేములకోట మినహా మిగిలిన 6 కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీంతో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలి వెళ్తున్నాయి.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

**- సంస్కరణలపై సుప్రీంలో విచారణ**



న్యూఢిల్లీ,ఆగస్ట్19 :నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

# ప్రత్యక్ష ఎన్నికలతో ప్రయోజనాలు

**- నేరుగా ఎన్నికైన వారికి ప్రజల్లో ఆదరణ**

**- అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి**

అమరావతి,ఆగస్ట్19 : ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు ఉంటాయని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎన్నికల్లో నేరుగా ఎంపికైన వారికి బలమైన ప్రజామోదం ఉంటుందని అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం మేయర్, మున్సిపల్ చైర్మన్‌పై ఉండదని స్పష్టం చేశారు. వీరిద్దరు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే సుదీర్ఘ అభివృద్ధి ప్రణాళికలు అమలుపరిచే అవకాశం ఉంటుందని అన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతం చేయవచ్చునని చెప్పారు. పెట్టుబడిదారులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని మేయర్, చైర్మన్ యాక్టివ్‌గా ప్రమోట్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వీరిద్దరిపై రాజకీయ ప్రభావం తగ్గుతుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకూ అవసరమైన పనులు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. అంతకుముందు అసెంబ్లీలో పురపాలక శాసనాల 4వ సవరణ బిల్లును మున్సిపల్ పరపాలన శాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన చట్ట సవరణ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపిక ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరగనుంది. ఇప్పటి వరకూ వీరిద్దరిని పరోక్ష పద్దతిలో ఎన్నుకుంటున్న సంగతి తెలిసిందే.

# బి ఆర్ ఎస్ పార్టీ శవ రాజకీయాలు మానుకోవాలి

**- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్**



నల్లబెల్లి: ఆగస్టు 19, విజన్ ఆంధ్ర: పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని నర్సంపేట మెడికల్ కాలేజీ లో ప్రతిష్టించాలని డిమాండ్ చేస్తున్నా బి ఆర్ ఎస్ పార్టీ ముందుగా సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తమరి పార్టీ కార్యాలయం, తెలంగాణ భవన్ లో ప్రతిష్టించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్ డిమాండ్ చేస్తు ఇన్నాళ్లు సుదర్శన్ రెడ్డి ఇతరుల శవాలతో రాజకీయం చేస్తే ఇప్పుడు ఇదే సుదర్శన్ రెడ్డి గారి శవంతో బి ఆర్ఎస్ శవ రాజకీయాలకి పాల్పడటం సిగ్గు చేటు సుదర్శన్ రెడ్డి ఎవరి వల్ల మానసిక వేధింపులకి గురైనారో. నర్సంపేట ప్రజలకు తెలియని విషయం కాదు ఇప్పుడు మొసలి కన్నీరు కార్చి జనాల్ని ఏమార్చి సానుభూతి పొందే ప్రయత్నం సరికాదు ప్రతిపక్ష పార్టీకి చెందిన సుదర్శన్ రెడ్డి గారి అస్వస్థకి గురి అయితే ప్రభుత్వం గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసి ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఆయన మరణం తర్వాత ఏ ఉద్యమ కారుడికి బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో దక్కని ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిన విషయాన్నీ గుర్తుకు ఉంచుకొని బి ఆర్ ఎస్ పార్టీ మసులుకోవాల్సిన అవసరం ఉంది, కాంగ్రెస్ కార్యకర్తల్ని రెచ్చగొట్టే విదంగా కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీ లని చింపడం మరియు ఎమ్మెల్యే గారి దిష్టిబొమ్మ దహనం లాంటి చిల్లర రాజకీయాలకి పాల్పడితే కాంగ్రెస్ పార్టీ అదే పద్దతిలో ధీటుగా సమాధానం చెబుతుందని హెచ్చరిస్తున్నాం.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు, పాక్స్ డైరెక్టర్లు చార్ల శివారెడ్డి, వైనాల అశోక్, మామిళ్ళ రాజిరెడ్డి, కద్దూరి కట్టయ్య, బత్తిని మల్లయ్య, సర్పంచులు సిద్ధ సంతోష్, వాంకుడోత్ హేమలత శ్రీధర్, ఎరుకల లలిత రవి,మాజీ ఎంపిటిసిలు మాలోత్ ప్రతాప్ సింగ్, వైనాల వీరస్వామి, మండల ప్రధాన కార్యదర్శి మాలోత్ మోహన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేష్, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దూరి తిరుపతిరావు, నల్లబెల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు బత్తిని మహేష్, మండల నాయకులు కొమురారెడ్డి,కోల లింగయ్య, యాకయ్య, మాసంపల్లి ప్రభాకర్, కుంచాల రాజు, పోగుల కుమారస్వామి, భూశీపల్లి శ్రీను, కుమారస్వామి, బాబురావు, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19,(విజన్ ఆంధ్ర) : నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి విడత ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు, పురపాలక సంఘాల కమిషనర్లతో ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో పురోగతి, 2వ విడత జాబితాపై జూన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో జిల్లాలో 8 వేల 851 ఇండ్లు మంజూరయ్యాయని, ఇంకా 1 వేయి 100 ఇండ్ల పనులు ప్రారంభం కాలేదని, ఇందుకు గల కారణాలను నివేదిక రూపంలో సమర్పించాలని, వెంటనే ఇండ్ల పనులు ప్రారంభించాలని తెలిపారు. బేస్మెంట్, రూఫ్, స్లాబ్ లెవెల్ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణ పనులలో పురోగతి సాధించాలని తెలిపారు. 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఏ ఒక్క అనర్హులు ఉండకూడదని, అర్హులు మాత్రమే జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. గుడిసెలలో నివసించే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కోసం అనేక దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల పేర్లను గ్రామ సభ నిర్వహించి తీర్మానాలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, మున్సిపాలిటీలలో రూఫ్ బలంగా ఉండి పైన స్లాబ్ వేసుకునే అర్హులైన వారిని గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రకాష్ రావు, మేనేజర్ పుష్పలత, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఎ. ఈ.లు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్.ఐ.వి., ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19,(విజన్ ఆంధ్ర) : జిల్లాలో హెచ్.ఐ.వి. ఎయిడ్స్ వ్యాధి, లైంగిక సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో పాలనాధికారి ఛాంబర్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నాగేంద్ర, ఇతర వైద్యాధికారులతో కలిసి ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లైంగిక సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వ్యాధులపై ఏవైనా సందేహాలు, ప్రమాద అవకాశం, వ్యాధి తెలుసుకొనేందుకు క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# “పాఠశాల ఆరోగ్యంవెల్నెస్ కార్యక్రమంతో విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రోత్సాహం“

### యాదాద్రి భువనగిరి జిల్లాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కోప్ సంస్థమహిత సంస్థ, యూనిసెఫ్ సహకారంతో కార్యక్రమాలు






యాదాద్రి భువనగిరి: కౌమారదశ విద్యార్థుల్లో శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు పాఠశాల ఆరోగ్యంవెల్నెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెస్సివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) ప్రతినిధులు





వి . సోమ నర్సయ్య, అశ్విని, యాదగిరి, నరసింహ రాజు, వెంకటేష్ తెలిపారు. మహిత, యూనిసెఫ్ సహకారంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. కౌమారదశలో విద్యార్థుల్లో చోటుచేసుకునే శారీరక, మానసిక, భావోద్వేగ మార్పులపై శాస్త్రీయ అవగాహన కల్పించడం, అపోహలుఅనుమానాలను తొలగించడం, సమస్యలను స్వేచ్ఛగా చర్చించుకునే వాతావరణాన్ని కల్పించడం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ దశను సానుకూలమైన అభివృద్ధి దశగా విద్యార్థులు అర్థం చేసుకునేలా మార్గదర్శనం చేస్తున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన సమతుల్యమైన పోషకాహారం, క్రమం తప్పని శారీరక వ్యాయామం, తగినంత నిద్ర, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. రక్తహీనత నివారణ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, స్థానికంగా మరియు సీజన్‌కు అనుగుణంగా లభించే పండ్లు, కూరగాయల ప్రాధాన్యతను వివరిస్తున్నారు. అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

**మానసిక ఆరోగ్యంసంబంధాలపై దృష్టి**

విద్యార్థుల భావోద్వేగ శ్రేయస్సు, మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమని కార్యక్రమంలో తెలియజేస్తున్నారు. భావోద్వేగాలను ఆరోగ్యకరమైన రీతిలో వ్యక్తపరచడం, అవసరమైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు లేదా నమ్మకమైన పెద్దల సహాయం కోరడం వంటి అంశాలను విద్యార్థులకు వివరిస్తున్నారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వక సంబంధాలు, పరస్పర గౌరవం, నమ్మకం, సహానుభూతి, బాధ్యతాయుతమైన ప్రవర్తన వంటి విలువలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నారు. తమ అభిప్రాయాలను గౌరవప్రదంగా వ్యక్తపరచడంతో పాటు ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సంబంధాలను నిర్మించుకోవచ్చని చెబుతున్నారు.

**లింగ సమానత్వంబాధ్యతాయుత పౌరసత్వం**

లింగపరమైన వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం, భద్రత ఉండేలా విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నారు. లింగపరమైన పాత్రలు మార్పులకు లోబడి ఉంటాయని, కుటుంబంసమాజంలో బాధ్యతలను సమానంగా పంచుకోవడం వల్ల అందరికీ ప్రయోజనం కలుగుతుందని వివరిస్తున్నారు. గౌరవం, సహానుభూతి, పర్యావరణ బాధ్యత, రాజ్యాంగ విలువలు, డిజిటల్ పౌరసత్వం వంటి అంశాల ద్వారా విద్యార్థుల్లో బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించేందుకు కార్యక్రమం దోహదపడుతోందని నిర్వాహకులు తెలిపారు. వ్యక్తిగత నిర్ణయాలకు సామాజిక ప్రభావం ఉంటుందని అర్థం చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

**మాదక ద్రవ్యాల దుర్వినియోగ నివారణ**

పొగాకు ఉత్పత్తులు, గుట్కా, ఖైని, బీడీలు, మద్యం తదితర హానికర పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం, అవసరమైనప్పుడు నమ్మకమైన పెద్దలు, కౌన్సిలర్లు మరియు అందుబాటులో ఉన్న సహాయక వ్యవస్థలను సంప్రదించడం వంటి అంశాలపై విద్యార్థులకు మార్గదర్శనం చేస్తున్నారు. పాఠశాల ఆరోగ్యంవెల్నెస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవడంతో పాటు, మానసికంగా దృఢంగా, సామాజికంగా బాధ్యతాయుతంగా ఎదగడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను పొందుతున్నారని స్కోప్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించవచ్చని తెలిపారు.

# ఐదో అంతస్తు నుంచి పడి కార్మికుడి దుర్మరణం

- **మిషన్ బేరింగులు ఊడిపోవడంతో అదుపుతప్పిన క్రేన్**
- **సేఫ్టీ ఏర్పాట్లు లేకపోవడమే ప్రమాదానికి కారణమంటున్న స్థానికులు**
- **భార్య, ఇద్దరు చిన్నారులకు దిక్కెవరు?**
- **భవన నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు**

పేట్ బషీరాబాద్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో క్రేన్ మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందిన విషాద ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పద్మనగర్ ఫేజ్2లోని సాయిబాబా ఆలయం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతుడు సిలివేరు కుమార్ (35)గా పోలీసులు గుర్తించారు. ఆయన స్వస్థలం జనగామ జిల్లా కొడకండ్ల మండలం రంగాపురం గ్రామం. తండ్రి సోమయ్య. కుమార్‌కు భార్య మమతతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ప్రస్తుతం గాజులరామారంలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిసింది.

**క్రేన్ బేరింగులు ఊడిపోవడంతో..**

స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. పద్మనగర్ ఫేజ్2లోని సాయిబాబా ఆలయం సమీపంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణంలో కింద నుంచి భవన నిర్మాణ సామగ్రిని పై అంతస్తులకు తరలించే క్రేన్ మిషన్‌కు కుమార్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీ పనుల్లో భాగంగా బుధవారం కూడా కుమార్ క్రేన్ మిషన్‌పై విధులు నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా మిషన్ బేరింగులు ఊడిపోయినట్లు సమాచారం. దీంతో మిషన్ అదుపుతప్పడంతో దానిపై ఉన్న కుమార్ ఐదో అంతస్తు నుంచి ఒక్కసారిగా కిందపడిపోయాడు. తీవ్ర గాయాల కారణంగా ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.

**సేఫ్టీ ఏర్పాట్లు ఎక్కడ?**

ప్రమాదం జరిగిన నిర్మాణ ప్రదేశంలో కార్మికుల భద్రతకు తగిన రక్షణ చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు, రక్షణ వలలు, ఇతర సేఫ్టీ చర్యలు తప్పనిసరిగా ఉండాల్సినప్పటికీ అవి సక్రమంగా ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక కుటుంబానికి ఆధారమైన కుమార్ ప్రాణాలు కోల్పోవడంతో ఆయన భార్య, ఇద్దరు చిన్నారులు దిక్కులేని పరిస్థితిలోకి నెట్టబడ్డారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుడి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు తక్షణమే స్పందించాలని, ప్రమాదానికి కారణాలను పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**పోలీసుల దర్యాప్తు**

సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి







అసలు కారణాలు, నిర్మాణ ప్రదేశంలో భద్రతా ప్రమాణాల అమలు, క్రేన్ మిషన్ నిర్వహణ తదితర అంశాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్మికుడి మృతికి ఎవరి నిర్లక్ష్యం కారణమైందో తేల్చి, బాధిత కుటుంబానికి చట్టపరమైన న్యాయం, తగిన పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల అభివృద్ధికి చర్యలు....

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19,(విజన్ ఆంధ్ర) : ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన నిర్వహణ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల గిరిజన పిల్లల భవిష్యత్తును బంగారుమయంగా మార్చే విద్యాలయమని తెలిపారు. విద్యార్థులు గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుండి ఎక్కువగా ఉన్నారని, స్టేట్ సిలబస్ నుండి సి.బి.ఎస్.ఈ. సిలబస్ కు మారి క్రమంలో కొంత ఇబ్బంది ఉంటుందని, విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో వారికి అర్థమయ్యే రీతిలో బోధించి ఆంగ్లంలో పట్టు సాధించేలా నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా





అధ్యాపకులు పర్యవేక్షించాలని, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు అందుతున్న బోధన పై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకోవాలని అన్నారు. విద్యార్థులకు మాతృభాష నుండి ఆంగ్ల మాధ్యమానికి సులభంగా మారేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, నిరంతరంగా హాజరు పర్యవేక్షించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. విద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, తరగతిలో విద్యార్థికి అనారోగ్యం ఉండి, చదువుపై దృష్టి సారించలేకపోతున్న విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని తెలిపారు. విద్యాలయం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, విద్యాలయ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీ బంద్ సంపూర్ణం,

**- స్వచ్ఛందం! సహకరించిన ప్రతీ ఒక్కరికీ తుడుందెబ్బ హృదయపూర్వక ధన్యవాదాలు.**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు, 19 (విజన్ ఆంధ్ర) :కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో మరియు ఆసిఫాబాద్ పట్టణంలో బంద్ సంపూర్ణంగా, ప్రశాంతంగా ముగిసింది. ఆదివాసీల హక్కుల పోరాటానికి మద్దతుగా నిలిచి బంద్‌ను విజయవంతం చేసిన అందరికీ ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపిన ఆదివాసీ నాయకులు. ఈ సందర్భంగా ఆదివాసి నాయకులు మాట్లాడుతూ... తమ వ్యాపారాలను స్వచ్ఛందంగా మూసివేసి ఆదివాసీల పోరాటానికి పూర్తి మద్దతు అందించిన వర్తకులకు, దుకాణ యజమానులకు.మరియు బంద్‌కు సహకారం అందించిన ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు, విద్యార్థినీ విద్యార్థులకు,ఉపాధ్యాయులకు బంద్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సహకరించిన పోలీసు యంత్రాంగానికి.మరియు ఆదివాసీల ఆకాంక్షలను ఎల్లవేళలా ఇలాగే ఉండాలని అన్నారు.

# ప్రపంచ వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలి

**-దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్**



హైదరాబాద్, ఆగస్ట్ 19 (విజన్ ఆంధ్ర) : ప్రపంచ వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్‌లోని విశిష్ట మెగాలిథిక్ మెన్హిర్స్, స్టోన్ సర్కిల్స్, సమాధులను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ), తెలంగాణ వారసత్వ శాఖ, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ అధికారులు, పురావస్తు నిపుణులు సంయుక్తంగా పరిశీలించినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముడుమాల్ ఇప్పటికే యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో ఉందని, చేర్చేందుకు అధ్యయనాలు, డాక్యుమెంటేషన్ కొనసాగుతున్నాయని ఏఎస్ఐ హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డా.నిహిల్ దాస్ తెలిపారు. 2, 3 వేల ఏళ్ల నాటి మెన్హిర్లు, స్టోన్ సర్కిల్స్, ఖగోళ–సూర్యగమన సంబంధాలు ఈ ప్రాంతానికి ప్రత్యేకతనిస్తున్నాయని పేర్కొన్నారు. అంబేకర్ ముడుమాల్‌ను సహజ స్వరూపానికి భంగం కలగకుండా సంరక్షించాలని ఏఎస్ఐ అసిస్టెంట్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డా.రోహిణి పాండే సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.కె.పి.రావు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ కోఆర్డినేటర్ ఖైజర్ భాషా, క్షేత్ర కన్సల్టెన్సీ, సంబంధిత బృందాలు, జిల్లా అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# గౌడెల్లి రామకృష్ణమాదిగ మృతికి ఎమ్మార్పీఎస్ నేతల సంతాపం..!



కాప్రా/ఆగస్టు 19( విజన్ ఆంధ్ర ప్రతినిధి ): నాచారం వాస్తవ్యులు, దళిత జాతి ముద్దుబిడ్డ, కీర్తిశేషులు గౌడెల్లి రామకృష్ణమాదిగ మృతిపట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రంగ ప్రణయ్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొరపాక అంజి మాదిగ, బొడ్డు శివ, అద్వైత్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణమాదిగ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని వారు ప్రార్థించారు.

# ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేకుంటే తొలగించినట్లు కాదు

**- ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ కె. సురేంద్ర మోహన్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేనంత మాత్రాన ఓటు హక్కు కోల్పోయినట్లు కాదని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ కె. సురేంద్ర మోహన్ తెలిపారు. అర్హత ఉన్న వారు ఫారం6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ముసాయిదా ఓటరు జాబితాపై సమీక్ష నిర్వహించారు. అనామలీస్, నో మ్యాపింగ్ జాబితాల్లో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి, ఏఈఆర్ఓల ఆధ్వర్యంలో నిర్వహించే విచారణకు హాజరై తగిన గుర్తింపు పత్రాలు సమర్పించాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. జూన్ 15 నాటికి జిల్లాలో 2,75,570 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుత ముసాయిదా జాబితాలో 2,37,006 మంది నమోదయ్యారని తెలిపారు. 38,564 మంది తగ్గగా, అనామలీస్ జాబితాలో 74,462 మంది, నో మ్యాపింగ్ జాబితాలో 12,027 మంది ఉన్నారని చెప్పారు. మొత్తం 86,489 మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.అక్టోబర్ 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులు కూడా ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్యను 316 నుంచి 322కు పెంచినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టి. వినోద్‌కుమార్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

**- డీఎంహెచ్ఓకు బీసీ పొలిటికల్ జేఏసీ విజ్ఞప్తి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ భాస్కర్ నాయక్‌ను జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్ నాయుడు మాట్లాడుతూ... సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను, సిబ్బందిని సమన్వయం చేస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేసే అధికారులకు జేఏసీ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి.వి. గౌడ్, పట్టణ అధ్యక్షుడు దేవర శివ, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి ఆస్కని రమేష్, నిప్పు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయం పెంచేందుకు ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలి

**- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.**



మహబూబ్ నగర్ ఆగస్ట్ 19 (విజన్ ఆంధ్ర) రైతుల ఆదాయం పెంచడంతో పాటు నీటి వనరులు, భూసారాన్ని పరిరక్షించేందుకు ఉద్యానవన, తక్కువ నీటి వినియోగ పంటల సాగును ప్రోత్సహించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం భూత్పూర్ మండలం శేరిపల్లి గ్రామంలో జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో రైతులకు, గ్రామ సర్పంచ్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్ సి.ఎం.డి జితేష్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితులు మారి వర్షాభావం ఏర్పడుతున్నందున వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు తదితర పంటల సాగుపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లిఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిలి మాట్లాడుతూ పంటల మార్పిడి, ఆధునిక సాగు పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు. తక్కువ వర్షపాతం, భవిష్యత్ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే పంటలను ఎంచుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన కూరగాయల నారు, విత్తనాలు, మల్చింగ్, పందిళ్ల సాగు వంటి సదుపాయాలను ప్రభుత్వం అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు సమూహాలుగా ఏర్పడి సాగు వివరాలను ఉద్యానవన శాఖకు అందిస్తే అవసరమైన నారును తెప్పించి అందించే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, కొత్తకోట సమీపంలోని శంకరెడ్డిపల్లిలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే మార్కెటింగ్ సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీలు త్వరగా మంజూరు చేయాలని అధికారులను కోరారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గంలోని గ్రామాల్లో తక్కువ వోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు తదితర సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారి టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్. సి.ఎం డి. జితేష్ పాటిల్ ను కోరారు. అలాగే బూత్‌పూర్‌లో విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్ సి.ఎం.డి జితేష్ పాటిల్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని కేవలం ఒకే పంటకు పరిమితం చేయకుండా పాడి, మేకల పెంపకం, చేపలు, తేనెటీగల పెంపకం, ఉద్యాన పంటలు, కూరగాయలు వంటి అనుబంధ రంగాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కొత్త పంటలను ముందుగా చిన్న విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా సాగు చేసి, ఫలితాలను బట్టి విస్తరించాలన్నారు. మార్కెట్ అవకాశాలను ముందుగానే గుర్తించి ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మట్టిని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని, పంట అవశేషాలను కాల్చకుండా సేంద్రియ పదార్థాలుగా మార్చి భూమికి అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, అనిశ్చిత వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగు విధానంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. వరి, పత్తితో పాటు కూరగాయలు, పూలు, ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, నువ్వులు, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తమ గ్రామాల్లో కొంతమంది రైతులతో ప్రయోగాత్మకంగా పంటల మార్పిడిని ప్రారంభించి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం, విత్తనాలు, వ్యవసాయ సమాచారం అందించేందుకు జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతకు ముందు లిజిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్‌లి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఉద్యానవన శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను, రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీల గురించి వివరించారు. తక్కువ నీటితో సాగయ్యే కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను రైతులు చేపట్టాలని సూచించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్, మల్చింగ్, పందిళ్లు, నాణ్యమైన నారు వంటి సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. స్థానిక మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను ఎంచుకుని ముందస్తు మార్కెటింగ్ ప్రణాళికతో సాగు చేయాలని సూచించారు. తొలుత, కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, సి. ఎం .డి జితేష్ పాటిల్ తో కలిసి శేరిపల్లి రైతులు వీరస్వామి, లక్ష్మయ్య సాగు చేస్తున్న కాకరకాయ, చిక్కుడుకాయ తోటలను పరిశీలించారు. రైతులు ఎకరాకు సుమారు రూ.20 వేల పెట్టుబడితో సాగు చేస్తున్నామని, అనుకూల దిగుబడి వస్తే మూడు నెలల్లో సుమారు రూ.2 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. అనంతరం ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి సాగు ఉపకరణాలు, తేనె ఉత్పత్తులు, రైతులకు అందించనున్న కూరగాయల నారును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాలకోటి, వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, గ్రామ సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# వనపర్తిలో ఘనంగా ఫోటోగ్రఫీ డే వేడుకలు

**సరోజ్ సూద్ వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ**

**ఐకమత్యంతోనే హక్కుల సాధన సంఘం అధ్యక్షుడు రాము**





వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : జిల్లా పట్టణ ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పాలిటెక్నిక్ మైదానంలో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు ముంత నిర్మల జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వల్లభ్‌నగర్‌లోని సరోజ్ సూద్ వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రాము మాట్లాడుతూ.. ఫోటో గ్రాఫర్లందరూ ఐక్యంగా ఉండటం వల్లే ప్రభుత్వ సహకారంతో యూనియన్ భవన నిర్మాణానికి స్థలాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్ర నాయకుల సమక్షంలో భారీ సభ నిర్వహించి ఫోటోగ్రాఫర్ల భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు రవి, స్వాతి శ్రీను, లక్ష్మి శ్రీను, జెబ్బర్, వెంకటేష్, శేఖర్, సుల్తాన్, క్యాషియర్లు బాలు, శ్రీను, ఉపాధ్యక్షులు యాదగిరి, నిరంజన్, సహాయ కార్యదర్శులు ఈశ్వర్, నజీర్, కుటుంబ భరోసా ఇన్‌చార్జి సూరి, సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్యామ్‌లాల్, ప్రధాన కార్యదర్శులు, సంఘ సభ్యులు మరియు పట్టణ ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# ఒక్క ఫోటో వెయ్యి మాటలకు సమానం

**- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**- వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం**




వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : ఒక ఫోటో వెయ్యి మాటల భావాన్ని తెలపడమే కాకుండా, సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ఎలాంటి అలంకరణ లేకుండా ప్రజల ముందర ఉంచే శక్తి ఫోటో జర్నలిజానిదేనని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఫోటో జర్నలిస్టులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేక్ కట్ చేసి, ఫోటో జర్నలిస్టులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కెమెరాతో బంధించే ఒక క్షణం శాశ్వత జ్ఞాపకంగా మారి, ఒక తరానికి చెందిన చరిత్రను మరొక తరానికి అందించే వారధిలా పనిచేస్తుంది. ఫోటోగ్రఫీ కేవలం ఒక కళ మాత్రమే కాదని, సమాజాన్ని ప్రతిబింబించే అద్దం, వాస్తవాలను వెలుగులోకి తెచ్చే శక్తివంతమైన ఆయుధమని తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక మార్పులను భావితరాలకు అందించే సజీవ దస్తావేజులు ఛాయాచిత్రాలేనని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ జర్నలిస్టులు ప్రాణాలకు తెగించి సంఘటనలను ప్రజల ముందుకు తీసుకురావడం అభినందనీయమని, ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడంలో వారి పాత్ర కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, వనపర్తి సీఐ సుగంధ రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడులతో పాటు ఫోటో జర్నలిస్టులు రాము, బాలరాజు, యూసుఫ్, యాదిరెడ్డి, లోకేష్, శ్రీకాంత్, మహేష్, ఆంజనేయులు, జ్ఞానమూర్తి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ దోమల దినోత్సవం ఆగస్టు 20

**- దోమలపై అవగాహనతోనే వ్యాధుల నివారణ**

**- నీరు నిలువ ఉండకుండా చూసుకుందాం దోమలను తరిమికొడుదాం వ్యాధులను నివారిద్దాం**

**- పాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం ప్రియాంక**




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): ఆగస్టు 19 : ప్రతి సంవత్సరం ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం, దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. ఆడ అనాఫిలిస్ దోమల వలన మానవులకి మలేరియా వ్యాధి వ్యాపిస్తుందనే విషయాన్ని కనుగొన్న డాక్టర్ /శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రోస్ 1987లో కనుగొనడం జరిగింది.వైద్యుడిగా పనిచేస్తూనే అంటువ్యాధులపై పరిశోధనలు చేసేవారు సర్ రోనాల్డ్ రోస్ చేసిన ఆ గొప్ప పరిశోధనకు గుర్తింపుగా 1902 సంవత్సరంలో భారత ప్రభుత్వం వారు నోబెల్ బహుమతి ప్రకటించారు . ఒకప్పుడు మలేరియా వ్యాధి ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందిని బాధించేది కానీ ఈ వ్యాధి ఎలా వ్యాపిస్తుందో శాస్త్రవేత్తలకు పూర్తిగా అప్పటివరకు తెలియదు మలేరియా గురించి అనేక అనుమానాలు ఉన్నప్పటికీ దాని వెనుక ఉన్న అసలు కారణాన్ని తెలుసుకోవడానికి ఎంతోమంది పరిశోధనలు చేశారు. కానీ దీనిని కనుగొన్నది మాత్రం రోనాల్డ్ రోస్ మాత్రమే దీనిని పునస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం దోమల వృద్ధికి అనుకూలంగా మారుతుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చు. ఇంటి పరిసరాల్లోని నీటి నిల్వలను పరిశీలించి, నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. నీటి తొట్టెలు, కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు డిస్పోజబుల్ గ్లాసులు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమల నియంత్రణ కేవలం ఆరోగ్యశాఖ బాధ్యత మాత్రమే కాదు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమల ద్వారా వచ్చే వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చు ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ దోమల నియంత్రణపై అవగాహన పెంచుకుని, తమ కుటుంబంతో పాటు సమాజ ఆరోగ్యాన్ని కాపాడేందుకు బాధ్యతగా వ్యవహరించాలి. అని పాలెం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ప్రజలకు సూచించారు.

# ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం

**- చోద్యం చూస్తున్న అధికారులు.**



నిజామాబాద్ ఆగస్టు19:( విజన్ ఆంధ్ర) : వడ్డించేవాడు మనవాడైతే ఏ వరుసలో కూర్చున్న ప్రయోజనమే అన్న చందంగా తయారైంది అధికారుల పనితీరు. ఏకంగా ప్రభుత్వ స్థలంలోనే ప్రైవేటు వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్న అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారి తీస్తుంది. గతంలో నిజామాబాద్ కలెక్టర్ గా పనిచేసిన ప్రద్యుమ్న ఆ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించిన ఇంటి నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ఎన్ ఓ సి ఇవ్వడం విమర్శలకు దారి తీస్తుంది. నగర నడిబొడ్డున గల నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఇంటి నిర్మాణం జరగడం దానికి అధికారులు వత్తాసు పలకడం వెనుక ఆంతర్యమేమిటో అంతు చిక్కడం లేదు. నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్కు ఆనుకొని 443 సర్వే నెంబర్ లో గల స్థలంలో అక్రమ నిర్మాణాలు యదేచ్చగా జరుగుతున్నాయి. గతంలోనూ ఇదే సర్వే నంబర్ లో ఓ రిటైర్డ్ ఎస్సై తన పలుకుబడిని ఉపయోగించి ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. తాజాగా మరో వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇదిలా ఉండగా 443 సర్వేనెంబర్ లో స్థలం పూర్తిగా ప్రభుత్వాన్నిదేనినని గత కలెక్టర్ ప్రద్యుమ్న నిర్ణయించారు. అందుకు సంబంధించిన ఆదేశాలను సంబంధిత రెవెన్యూ అధికారులకు పంపించారు. దీంతో ఆ స్థలాన్ని పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని కంచె ఏర్పాటు చేసింది. అప్పటి అధికారులు సైతం ఆ స్థలంలోకి ఎవరిని రాకుండా అడ్డుకున్నారు. ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా ప్రభుత్వ స్థలం అంటూ నిర్ధారించారు. కలెక్టర్ బదిలీ తర్వాత ఆ స్థలం పై కన్నేసిన ప్రైవేట్ వ్యక్తులు అధికారులను బురిడీ కొట్టించి అక్రమ నిర్మాణాలకు తెర లేపారు. దీనికి అవసరమైన అనుమతులు సైతం రెవెన్యూ అధికారులు ఇవ్వడం, తద్వారా టౌన్ ప్లానింగ్ అధికారులు ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా రెవెన్యూ అధికారులే ఎన్వోసీ ఇవ్వడం వల్ల మేము ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చామని చెప్పడం ముడుపులు ముడుతున్నాయన్న ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఇకనైనా జిల్లా కలెక్టర్ సీరియస్ గా పరిగణించి అధికారుల చేతివాటానికి అన్యక్రాంతమవుతున్న ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# రైలు వచ్చేంత వరకు పోరాటం ఆగదు

- సూర్యాపేటకు రైలుమార్గం సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తాం
- సూర్యాపేట బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయ్




సూర్యాపేట ఆగస్టు 19:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేటకు రైలుమార్గం వచ్చేంత వరకు తమ పోరాటం ఆగదని సూర్యాపేట బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయ్ అన్నారు. సూర్యాపేటకు రైలుమార్గం సాధించాలనే డిమాండ్‌తో బుధవారం జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేటకు రైలుమార్గం ఏర్పాటు చేయడం వల్ల జిల్లా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా సూర్యాపేట ప్రజలు రైలుమార్గం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించి రైలుమార్గం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. సూర్యాపేటకు రైలు వచ్చే వరకు ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, రైలుమార్గం సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మన్యం సింహాద్రి, కోశాధికారి బుర్ల మధు, స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు తోగట్టి మురళి, రామాచారి, బాణాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పరిపూర్ణ చారి, నర్సింహ చారి, దామోదరచారి తదితరులు పాల్గొన్నారు.

# డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటర్ లిస్ట్ లో సందేహాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి



సూర్యాపేట ఆగస్టు 19:(విజన్ ఆంధ్ర) : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీ నాయకులతో పోస్ట్ డ్రాఫ్ట్ కార్యకలాపాలు మరియు డ్రాఫ్ట్ పబ్లికేషన్ గురించి బుధవారం కలెక్టరేట్ వి సి హాల్ నందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చర్చించడం జరిగింది. పోస్ట్ డ్రాఫ్ట్ అప్లికేషన్ అయిన తర్వాత చేయవలసిన ప్రక్రియను రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించడం జరిగింది. సర్ లో డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటర్ లిస్టులో ఏమైనా సందేహాలు ఫిర్యాదులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులకు డ్రాఫ్ట్ రోల్ అందించడం జరిగిందని, రాజకీయ పార్టీ ప్రతినిధులు రూల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రక్రియ సజావుగా జరుగుటకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సి సెక్షన్ సూపర్డెంట్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నుండి సిహెచ్ రాజేశ్వరరావు,బి జె పి నుండి చల్లమల్ల నరసింహ, ఎండి హాబిద్, బి ఎస్ పి నుండి ఎం.స్టాలిన్, బిఆర్ఎస్ నుండి సత్యనారాయణ, వైఎస్ఆర్సిపి నుండి డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో భారీ కార్డన్ సర్చ్.. 179 బైక్‌లు, ఇతర వాహనాలు స్వాధీనం




ఆదిలాబాద్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): జిల్లా కేంద్రంలోని తిరుపల్లివాడ, ఖిల్లా ప్రాంతాలలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత తనిఖీలు (కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్) నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సుమారు 150 మంది పోలీసు సిబ్బందితో ఈ ఆపరేషన్ చేపట్టారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని 179 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, 1 కారును స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా నంబర్ ప్లేట్, ఫేక్ నంబర్ ప్లేట్లు కలిగిన 2 బైక్‌లను గుర్తించి బీఎన్ఎస్ సెక్షన్ 318(4) కింద చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. అలాగే అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై ఎక్సైజ్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మరియు మట్కా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. కాలనీవాసులు స్వచ్ఛందంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఆరోపణలు అవాస్తవం: డా. నరేష్ జాదవ్

ఆదిలాబాద్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : రాజ్యాంగబద్ధ నిబంధనలకు లోబడే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందని ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ స్పష్టం చేశారు. బడ్జెట్ ఆమోదం, ట్రెజరీ నిబంధనలతోనే నిధులు విడుదలవుతున్నాయని, అర్హత పరిశీలన తర్వాతే లబ్ధిదారులకు సాయం అందుతోందని తెలిపారు. ప్రభుత్వాలపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

## మహబూబ్‌నగర్‌లో 6.29 లక్షల మంది ఓటర్లతో ముసాయిదా జాబితా విడుదల



మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026)లో భాగంగా విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 6,29,402 మంది ఓటర్లు నమోదయ్యారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బి. సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు ముసాయిదా జాబితాలో 40,116 మందికి మ్యాపింగ్ పెండింగ్‌లో ఉండగా, 1,96,576 లాజికల్ డిస్క్రెపెన్సీలు గుర్తించబడ్డాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించి, నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు నియోజకవర్గాల వారీగా మహబూబ్‌నగర్‌లో 2,13,588, జడ్చర్లలో 1,99,354, దేవరకద్రలో 2,16,460 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 3,13,256 మంది పురుషులు, 3,16,107 మంది మహిళలు, 19 మంది థర్డ్ జెండర్, 20 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు నమోదయ్యారుబీఎల్ఓల సంఖ్యను 846 నుంచి 862కు పెంచగా, కొత్తగా 16 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. తుది ఓటర్ల జాబితా ప్రక్రియ పారదర్శకంగా సాగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుసూదన్, హరిప్రియ, ఆర్డీఓ నవీన్, ఎలక్షన్ డీటీ అధికారి జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# వీరవనిత గద్వాల మహారాణి ఆది లక్ష్మిదేవమ్మ వర్ధంతి జ్ఞాపకం !

గద్వాల ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) :

*నిజాం నవాబును ఎదురించిన వీరవనిత. గద్వాల సంస్థానాన్ని స్వతంత్ర సంస్థానంగా ప్రకటించి పాలించిన మహారాణి. నిజాం ప్రభువుల నుంచి పతనమైన తన రాజ్యాన్ని పునరుద్ధరించుకున్న వీరవనిత మహారాణి ఆది లక్ష్మిదేవమ్మ వర్ధంతి జ్ఞాపకం !*

గద్వాల సంస్థానంలో సాహితి పోషకులలో చెప్పుకోదగ్గ రాజు శ్రీ మహారాజా సీతారామభూపాలుడు 1924లో స్వర్గస్తు లైనారు. తరువాత పాలన బాధ్యతలు శ్రీ మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ 1929లో చేపట్టారు. 1949లో జాగీరుల రద్దుతో రాణి పాలన ముగిసంది. ఆమె చేసిన 25సంవత్సరాల పాలనలో ఎ న్నో విజయాలు. మన్ననలను, ప్రశంసలను రాణి అందు కున్నారు. 25సంవత్సరాల రాణి పాలనను గద్వాల చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించదగ్గదిగా ఇప్పటికీ చెప్పుకుంటారు.

పూడూరును చాళుక్యులు పరిపాలించగా, చాళుక్యులకు, పల్లవులకు మధ్య జరిగిన యుద్ధంలో పెదసోమభూపాలుడు గదను, వాలమును ప్రయోగించడం వలన ఈ కోటకు గదవాల (గద్వాల) అనే పేరు వచ్చిందని చెబుతారు. ఈ విధంగా 1663 నుండి 1950 వరకు గద్వాల సంస్థానాధీశులచే పరిపాలింపబడింది. రాజాభరణాల రద్దు తరువాత ఈ కోటను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని,

గద్వాల, తెలంగాణ రాష్ట్రం, జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలానికి చెందిన పట్టణం. ఇది జోగులాంబ గద్వాల జిల్లాకు పరిపాలనా కేంద్రం. మండలానికి, గద్వాల అసెంబ్లీ నియోజకవర్గానికి కేంద్రంగా కూడా ఉంది.

గద్వాల సంస్థానం తుంగభద్ర, కృష్ణానదుల మధ్య ప్రాంతంలో నడిగడ్డగా పిలిచే ప్రాంతంలో 800 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండేది. 14వ శతాబ్దంలో కాకతీయ సామ్రాజ్యం పతనం తర్వాత గద్వాల సంస్థానాధీశులు బహుమనీ సామ్రాజ్యం సామంతులుగా ఉన్నారు. 1663లో రాజా పెదసోమభూపాలుడితో ప్రారంభమైన గద్వాల సంస్థాన పాలన విలీనమయ్యే వరకు కొనసాగింది. 1704లో నాడగౌడుగా ఉన్న సోమన్న కృష్ణానది తీరన గద్వాల కోటను నిర్మించారు. రాజ్యాన్ని బనగానపల్లె, ఆదోని, సిరివెల్ల, నంద్యాల, ఆత్మకూరు, అహోబిలం ప్రాంతాలకు విస్తరించారు. 1909 వరకు గద్వాల సంస్థానాధీశులు సొంత నాణేలను ముద్రించుకున్నారు. ఈ సంస్థానంలో 11 మంది రాజులు, 9 మంది రాణులు పాలించారు. చివరగా మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ 1924 నుంచి సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యే వరకు మహారాణిగా కొనసాగారు. గద్వాల సంస్థాన వారసుడైన కృష్ణ రాంభూపాల్‌రెడ్డి 1962లో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

గద్వాల్ కోట ఒక అద్భుతమైన కట్టడం, దీని చుట్టూ పాత పట్టణం విస్తరించి ఉంది. కోటలో అనేక పురాతన దేవాలయాలు ఉన్నాయి, వాటిలో ముఖ్యమైనది శ్రీ చెన్నకేశవ స్వామి. జమ్ములమ్మ అనే మరొక ప్రసిద్ధ దేవాలయం పట్టణానికి పశ్చిమాన ఉంది.

మహారాణి ఆది లక్ష్మి దేవమ్మ మహబూబ్ నగర్ జిల్లా లోని ఒకనాటి గద్వాల సంస్థానాన్ని పాలించిన మహారాణి. రాజా చిన



సీతారామభూపాలుని భార్య. ఆయన అనంతరం పాలనచేశారు. 1946 నుండి 1949 వరకు పాలించారు. ఆమె ఈ సంస్థానపు చివరి పాలకురాలు కూడా. నిజాం నవాబును ఎదురించిన వీరవనిత. గద్వాల సంస్థానాన్ని స్వతంత్ర సంస్థానంగా ప్రకటించి పాలించించారు. సీతారామభూపాలునికి సంతానం లేకపోవడంచే నిజాం నవాబు మిర్ ఉస్మాన్ అలీఖాన్ తమ రాజ్యంలో గద్వాల సంస్థానాన్ని కలుపుకుంటే, రాణి న్యాయపోరాటం చేసి సంస్థానాన్ని తిరిగి చేజిక్కించుకున్నారు.

శ్రీ మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ పాలనలో చేసినా సాహితిసేవను గద్వాల చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించదగినది. రాణి పాలనలో వెలుగులోకి వచ్చిన సాహితి సేవలు ఎవరి పాలనలో వెలుగులోకి రాలేదు. ప్రతి సంవత్సరం కార్తీక మాఘ శుద్ధ పౌర్ణమి నాడు కవి పండితులను ఆదరించి వారిని సన్మానించి వారి పాదదూళిని సింధూరంగా భావించి నుదుటన పెట్టుకునేవారట. అలాగే ప్రతి మాఘపౌర్ణమి నాడు చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా దక్షిణ భారతదేశము నుంచి కళాకారులను ఆహ్వానించి సన్మానించేవారు. నాడు సన్మానం పొందిన వారిలో తిరుపతి వెంకటకవులు కూడా ఉన్నారు. ఆంధ్రదేశంలో గద్వాలలో సన్మానం పొందుట తమ విద్య కు పరిపూర్ణత లభించినట్లేనని కవులు భావించేవారు. అందుకే రాణి పాలనలో గద్వాలను విద్వద్గద్వాలగా కీర్తి సంతరించుకుంది.

సంస్థానంలో సంప్రదాయంగా వస్తున్న సాహిత్య పోషణను కొనసాగిస్తూ, ఎందరో కవులను ఆదరించి గద్వాలకు విద్వద్గద్వాలగా కీర్తి రావడానికి కారకులయ్యారు. ఎంతోమంది కవుల పుస్తకాలను ముద్రింపజేశారు. 1949 లో సంస్థానాల, జాగీర్ధారుల పాలనలు రద్దు కావటంతో రాణి సంస్థానపు ఆస్తులను, చారిత్రాత్మక గద్వాల కోటను ప్రభుత్వ పరం చేశారు. 1663లో రాజా పెద సోమభూపాలుడి పాలనతో ప్రారంభమైన గద్వాల సంస్థానపు పాలన 1949లో మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ పాలనతో ముగిసింది. ఆమె పేరు మీదుగా గద్వాల కోటలో మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇది మహబూబ్ నగర్ జిల్లాలో ఏర్పాటైన మొదటి డిగ్రీ కళాశాల.

మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ 1947లో భారత స్వాతంత్ర్యానంతరం నిజాం నవాబును ఎదిరించిన సాహసి. 1948లో భారత యూనియన్ దళాలు హైదరాబాదుపై పోలీస్ చర్య తీసుకొనే సమయంలో కర్నూలు మీదుగా హైదరాబాదుకు వెళ్ళడానికి తన సంస్థానం గుండా యూనియన్ దళాలకు ప్రవేశం కల్పించి తన దేశభక్తిని చాటుకున్నారు.

1948 సెప్టెంబరులో హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన పిదప తన సంస్థాన ఆస్తులను, తెలంగాణలోనే ప్రఖ్యాతి గాంచిన గద్వాల మట్టికోటను ప్రభుత్వానికి ధారాదత్తం చేసింది. ప్రస్తుతం ఈ కోటలోనే జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, పిజి సెంటర్, దేవాలయం ఉన్నాయి. డిగ్రీ కళాశాలకు ఈమె పేరిట మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ (మాల్డ్) డిగ్రీ కళాశాలగా పిలుస్తున్నారు.

### గద్వాల చీరలకు మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ

పునాదివేసారు. గద్వాలనుండి కొన్ని కుటుంబాలను బెనారస్ పంపించి అక్కడ నేతపని శిక్షణ ఇప్పించి దానిలో కూడా గద్వాల ప్రత్యేక అంచుని తయారుచేయడానికి బాటవేసింది రాణీ గారు. గద్వాల చీరకు అంత సొగసు పాపులారిటి ఎలా వచ్చింది అన్న ప్రశ్నకు రాణి గారికి వచ్చిన అలోచన కొత్తగా పట్టు+కాటన్ కలగలిపి చీరలు నేస్తే ఎలాగుంటుందన్న అదే విషయాన్ని కంచి, బెనారస్ లోశిక్షణ తీసుకొచ్చిన 12 మంది చేనేతలతో మాట్లాడారు. కోటగుమ్మం డిజైన్ గద్వాలకు చిహ్నంగా కనిపిస్తుంది. ఈ ఆలోచన ఆదిలక్ష్మిదేవమ్మ గారిదే.

1663లో మహారాజా పెద్దసోమభూపాలుని పాలనతో ప్రారంభమైన గద్వాల సంస్థానం 1949లో శ్రీ మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ పాలనతో అంతమైంది. 1949లో జాగీరుల రద్దు తో రాజుల పాలనకు తెరపడింది. మూడు సంవత్సరాలు ప్రభుత్వ పాలనను చూసిన ఆమె 18-8-1953న దివంగతులైనారు. 25సంవత్సరాలు సాగిన రాణిగారి పాలనను ఇప్పటికీ ఎవరు మరచిపోలేదు.

### శ్రీవారికి ఏరువాడ జోడు పంచెలు....

బహుమానంగా పంపటం కూడా మహారాణి హయాంలోనే మొదలైందన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు ముందు వెంకటేశ్వరస్వామికి గద్వాల నుండి పట్టుతో నేసిన జోడు పంచెలు బహుమానంగా వెళ్ళటం దశాబ్దాలుగా ఆనవాయితీగా ఉన్నది. జోడు పంచెలను తయారుచేసే చేనేతలు ప్రత్యేకంగా దీక్ష తీసుకుని 41 రోజుల పాటు ప్రత్యేకమైన మగ్గంలోనే నేస్తారు. శ్రీవారికి నేసే జోడు పంచెల మగ్గాన్ని ఏడాది మొత్తం మీద దేనికీ వాడ కుండా ఉంచుతారు. మహారాణి వారసులు కొడుకు, కోడలు లతా భూపాల్ నేటికీ ప్రతి ఏడాది గద్వాల నుండి జోడు పంచెలను నేయించి ప్రత్యేకంగా తిరుమలకు పంపుతూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

- చదువుతోపాటు క్రీడలు, కళా రంగాల్లోనూ రాణించాలి
- బీచుపల్లి గురుకుల, ఎర్రవల్లి కేజీబీవీ సందర్శించిన
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఎర్రవల్లి ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని ఫలితంగా తాము అనుకున్న రంగాల్లో రాణించేందుకు వీలవుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి బాలుర గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. గణితంలో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూనే ఖాన్ అకాడమీ డిజిటల్ లెర్నింగ్ తరగతులు కూడా సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎఫ్ఏ1 లో వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను తెలుసుకొని మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా, కళా రంగాల్లోనూ రాణించేందుకు ఎక్స్ట్రా కరిక్యులం ఆక్టివిటీస్ లో కూడా పాలుపంచుకునేలా చూడాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఎక్కువమంది 550కు పైగా మార్కులు పొందేలా చదవాలని ఆకాంక్షించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని, ఫుడ్ కమిటీ సభ్యులు ప్రతి రోజు ఆహారాన్ని తనిఖీ చేయాలన్నారు. వంటగదిని పరిశీలించి అక్కడి స్టోర్ రూమ్ లో వంట సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులను సరైన కొలతలతో కుట్టించాలని ఆదేశించారు. కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి తగు సూచనలు చేశారు. అనంతరం ఎర్రవల్లి కస్తూర్బా గాంధీ బాలికల



విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులతో మాట్లాడి వారికి ప్రతిరోజు వడ్డిస్తున్న ఆహారం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కేజీబీవీ కు సంబంధించిన పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులై ఉన్నత చదువులను అభ్యసించి గొప్ప స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు రెగ్యులర్ గా తరగతులకు హాజరై బాగా చదువుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడి ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ పర్యటనలో గురుకుల ప్రిన్సిపల్ శ్రీనివాస్, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వర్ణలత, తదితరులు ఉన్నారు.

# దేశ ఇంధన భద్రతకు బొగ్గుతో పాటు పునరుత్పాదక విద్యుత్‌లోనూ సింగరేణి కృషి

**మరో నాలుగు దశాబ్దాల పాటు థర్మల్ విద్యుత్‌కు డిమాండ్ ఉండే అవకాశం**

**రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం జెన్‌కో, ట్రాన్స్‌కోతో కలిసి సమష్టి కృషి**

కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 20(విజన్ ఆంధ్ర) : దేశ ఇంధన భద్రతకు అవసరమైన బొగ్గును తగినంతగా అందించడంతో పాటు పునరుత్పాదక విద్యుత్ రంగంలోనూ సింగరేణి తన వంతు కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్, సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పోలో భాగంగా బుధవారం నిర్వహించిన "భారత ఇంధన భద్రతవిద్యుత్ ఉత్పత్తి" అంశంపై జరిగిన గోష్టిలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణి దశాబ్దాలుగా దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు బొగ్గును అందిస్తూ కీలక పాత్ర పోషిస్తోందని సీఎండీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ విద్యుత్ అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర జెన్‌కో, ట్రాన్స్‌కోతో కలిసి సింగరేణి సమష్టిగా పనిచేస్తోందని పేర్కొన్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి సంస్థ ఇప్పటికే థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, క్రిటికల్ మినరల్స్ రంగాల్లోకి అడుగుపెట్టిందని తెలిపారు. భవిష్యత్‌లో దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి మరో నాలుగు దశాబ్దాల పాటు డిమాండ్ ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దేశ ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకుని రానున్న కాలంలో బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచేందుకు సింగరేణి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుందని డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు




అనుగుణంగా పునరుత్పాదక ఇంధన రంగంలోనూ సంస్థ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. ఈ గోష్ఠికి ప్రొఫెసర్ పవన్ కుమార్ పరనంది సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమానికి తెలంగాణ ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ హాజరయ్యారు. ప్యానెల్ చర్చలో సింగరేణి సీఎండీతో పాటు తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన నిగం లిమిటెడ్ సీఎండీ దేవేంద్ర శృంగి, ఎన్టీపీసీ సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ శర్మ, గ్రిడ్‌కో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రియ రథ్, ఒడిశా పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ కేదార్ రంజన్ పాండు, ఛత్తీస్‌గఢ్ స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్ ఎండీ సంజీవ్ కుమార్ కటియార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇమాంపేట గురుకులంలో పోలీసు ప్రజా భరోసా




సూర్యాపేట ఆగస్టు 19:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఆదేశాల మేరకు బుధవారం రూరల్ ఎస్సై యం. అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఇమాంపేటలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో 'పోలీస్ ప్రజా భరోసా' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ అనర్థాలు, డయల్ 112 అత్యవసర సేవలు, 'పోలీస్ అక్కా' వ్యవస్థ మరియు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంటల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి - జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్



ఆదిలాబాద్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): జైనథ్ మండలంలోని కంట గ్రామంలో 100% రాయితీ పంటలను జిల్లా వ్యవసాయ శాఖాధికారి రవీందర్ సింగ్ పరిశీలించారు. ఎలినో ప్రభావం దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండి, తక్కువ పెరిగిన సోయా, పత్తి పంటలపై యూరియా పిచికారి చేయాలని సూచించారు. సోయాలో కాండం తొలుచు పురుగు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

# ఎంపీ గోడం నగేష్‌ను కలిసిన దళిత సంఘాల నాయకులు



ఆదిలాబాద్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): పాత అంబేద్కర్ భవన్ అభివృద్ధి, గుంతల పూడ్చివేత తదితర చిన్న పనుల నిమిత్తం నిధులు కేటాయించాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు ఎంపీ గోడం నగేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విజ్ఞప్తిపై ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాల్యాల స్వామి, జాదవ్ సాంబశివరావు, షిండే సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాత్రివేళ తరగతులు నిర్వహిస్తున్న బిజిఅర్. స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

**- ఎంఈఓ కి వినతి - విద్యార్థి సంఘాల నాయకులు**



అయిజ ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలోని బిజిఅర్.స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆరోపిస్తూ, దీనిపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న బిజిఅర్. స్కూల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ. రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్ పల్లి రంగస్వామి, పిడిఎస్ యు. విజృంభణ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ బుధవారం మండల ఎంఈఓ ఆఫీసులో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నిర్ణీత సమయాల్లోనే తరగతులు నిర్వహించాల్సి ఉండగా, రాత్రివేళ కూడా తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులపై శారీరక, మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, విశ్రాంతి, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని అన్నారు. బిజిఅర్.స్కూల్‌లో రాత్రి సమయంలో తరగతులు నిర్వహిస్తున్నారనే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా ఉన్నారు అని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే తనిఖీ నిర్వహించి బీజిఅర్. స్కూల్ యాజ్యమైన పై చర్యలు తీసుకోవాలని కోరారు. రోజు పట్టణ కేంద్రంలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ విచ్చలవిడిగా పాఠశాలను నిర్వహిస్తున్నారని అన్నారు. కానీ ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా మండల విద్యాశాఖ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అన్నారు. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారి ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే ప్రైవేటు పాఠశాలలపై కఠినంగా వ్యవహరించాలని వారు కోరారు.

# వరుణ యాగ పాదయాత్రకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

**- వర్షాలు కురవాలి అలంపూర్ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి**

**- ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్**



అలంపూర్ ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా అలంపూర్ నియోజకవర్గంలో మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వరుణ యాగ పాదయాత్ర ఘనంగా ప్రారంభమైంది. అలంపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పాదయాత్రకు నియోజకవర్గంలోని రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ పట్టణంలోని గుడి నుంచి కృష్ణ, తుంగ భద్ర జలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.బుధవారం ఉదయం 11:29 గంటలకు శాంతినగర్‌లోని ఈశ్వరమ్మ గుడి రవీంద్ర హైస్కూల్ వద్ద వరుణ యాగ పాదయాత్ర ప్రారంభమైంది. అక్కడి నుంచి ప్రారంభమైన పాదయాత్ర జులేకల్ శివాలయం ఆర్డీఎస్ కాలువ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతుల పంటలు పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఈ పాదయాత్ర నిర్వహించామని అన్నారు.రైతుల సంక్షేమం, రాష్ట్ర సుభిక్షత కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ నియోజక వర్గంలోని అన్ని మండలాల మండల అధ్యక్షులు, సర్పంచులు ,కాంగ్రెస్ నాయకులు ,రైతులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్ని వరుణ యాగ పాదయాత్రను విజయవంతం చేశారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం..

## షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



గద్వాల ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ బృందం ఆధ్వర్యంలో బుధవారం మైనారిటీ కళాశాలలో విద్యార్థులకు మహిళా భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగం , అత్యవసర పోలీస్ సేవలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సేవల ప్రాముఖ్యత, డయల్ 112 అత్యవసర పోలీస్ సేవలు, అంబ్యులెన్స్ సేవలు, ఫైర్ సేవలు ప్రాముఖ్యత గురించి వివరించారు. సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలు, సైబర్ మోసాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థులు ఎలాంటి వేధింపులు లేదా ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా షీ టీమ్ నెశీ. 8712670312 కు గాని, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ ను గాని సంప్రదించాలని సూచించారు. ఫోక్సో యాక్ట్ చట్టాల గురించి వివరముగా తెలియజేశారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు, అనుమానాస్పద లింకులు, ఫేక్ అకౌంట్లు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటిపి.లు, ఫోటోలు వంటి సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే పోలీసులను ఆశ్రయించి తగిన సహాయం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ, నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను షీ టీమ్ సభ్యులు సులభమైన ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు తమ భద్రత పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్సై రాణి, సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి, కళాశాల సిబ్బంది, 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**- జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన**

**- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**- కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : హైదరాబాద్ నుంచి బుధవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు,వివరాల్లోని వ్యత్యాసాలు గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం మ్యాపింగ్ కాని ఓటర్లు,వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై, పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని,వీటిలో ఆధార్, ఆహార భద్రత కార్డులు ఉండవని స్పష్టం చేశారు.జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి, ధ్రువపత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లాల్లో చేపడుతున్న చర్యలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్లకు సూచించారు.ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు.ఓటర్ల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ చేపట్టాలన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలని సూచించారు. మ్యాపింగ్, నోటీసుల జారీ, క్లెయిమ్‌లుఅభ్యంతరాల పరిష్కారం వంటి ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ,నిర్ణీత కాలపరిమితిలో ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో క్లస్టర్ వారీగా మ్యాపింగ్ కాని ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని, వారికి సౌకర్యవంతమైన ప్రదేశాలను ఎంపిక చేసి ధ్రువపత్రాల స్వీకరణకు తేదీ,సమయాలను ముందుగా ఖరారు చేయాలని కలెక్టర్ సూచించారు.ఆయా కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. పౌరసత్వ నిర్ధారణకు సూచిత ధ్రువపత్రాల్లో ప్రభుత్వ ఉద్యోగి/పెన్షనర్ గుర్తింపు కార్డు లేదా పీపీఓ,01.07.1987కు ముందు జారీ చేసిన ప్రభుత్వ/స్థానిక సంస్థలు/బ్యాంకులు/పోస్టాఫీసు/ఎల్ఐసీ/పీఎస్‌యూ ధ్రువపత్రం,జనన ధ్రువపత్రం, పాస్‌పోర్ట్, విద్యా ధ్రువపత్రం,శాశ్వత నివాస ధ్రువపత్రం,అటవీ హక్కుల ధ్రువపత్రం,ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ/ఇతర కుల ధ్రువపత్రం,జాతీయ పౌర పట్టిక,ప్రభుత్వం జారీ చేసిన భూమి/ఇంటి కేటాయింపు ధ్రువపత్రం ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్,ఎన్నికల విభాగం అధికారి మంజుల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ సమయపాలన ఎక్కడ..?

**- నిర్ణీత సమయానికి రాక.. కేంద్రంలో వెలవెలబోయిన వైనం..**

**- ఇద్దరికి మించి లేని చిన్నారుల హాజరు..**

**- టీచర్ తీరుపై తల్లిదండ్రుల్లో అసంతృప్తి..**

**- అధికారుల పర్యవేక్షణ ఏది..?**

**- అకస్మిక తనిఖీలు చేపట్టాలని డిమాండ్..**



సూర్యాపేట ఆగస్టు 19:(విజన్ ఆంధ్ర) : చిన్నారుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.సూర్యాపేట జిల్లా కేంద్రం 7వ వార్డులో ఓ అంగన్వాడీ



కేంద్రంలో అంగన్వాడి ఆయా స్కూల్ ఓపెన్ చేసిన కూడా టీచర్ నిర్ణీత సమయానికి హాజరు కావడం లేదని, మరోవైపు కేంద్రంలో ఇద్దరికి మించి పిల్లలు కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది.అంగన్వాడీ కేంద్రం నిర్ణీత వేళల్లో పనిచేయాల్సి ఉన్నప్పటికీ టీచర్ సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో కేంద్రానికి వచ్చే చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు.కేంద్రంలో వాస్తవంగా ఎంతమంది చిన్నారులు హాజరవుతున్నారు? హాజరు రిజిస్టర్‌లో ఎంతమంది పేర్లు నమోదవుతున్నాయి? అనే అంశాలను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే టీచర్ హాజరు, సమయపాలన, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం తదితర అంశాలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.చిన్నారుల సంక్షేమానికి ఉద్దేశించిన అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చిన్నారుల సంక్షేమానికి ఉద్దేశించిన అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సైబర్ నేరాలు,సోషల్ మీడియా మరియు మహిళల భద్రతపై షీ టీం అవగాహన సదస్సు



భూపాలపల్లి జిల్లా :19 ఆగస్టు ( విజన్ ఆంధ్ర ) ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు భూపాలపల్లి షీ టీం ఎస్సై స్వప్న కుమారి ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ & పీజీ కళాశాలలో సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల వినియోగం మరియు మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్ఐ స్వప్న కుమారి, సిబ్బంది విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వీడియో కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు లేదా ఓటీపీ లను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులు, లింకులు, అనుమానాస్పద మెసేజ్‌లను స్వీకరించవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భద్రతకు షీ టీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా ధైర్యంగా షీ టీంకు సమాచారం అందించాలని సూచించారు. షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో నేరస్తులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు, విద్యార్థులు ఎలాంటి భద్రతా సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించాలని, సైబర్ నేరాల విషయంలో అప్రమత్తతే ప్రధాన రక్షణ అని షీ టీం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి షీ టీం సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శక్తి పాలసీని రద్దు వెంటనే చేయాలి

**- పాలిటెక్నిక్ విద్యాను శక్తి పాలసీలో కలపవద్దు**

**- విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్**

**- బీఆర్ఎస్వి. జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, విద్యార్థులు**




గద్వాల ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల మండలం లోని గోనుపాడు దగ్గర ఉన్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాలిటెక్నిక్ డిపార్ట్మెంట్ను శక్తి పాలసీలో కల్పవద్దని చేస్తున్న నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్బంగా బీఆర్ఎస్వి. నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ ఎవరిని అడిగి విలీనం చేశారని, స్కిల్ వర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనానికి రేవంత్ తెచ్చిన శక్తి స్కీమ్ విద్యార్థుల పాలిట శాపంగా మారిందని అన్నారు. శక్తి స్కీమ్ వల్ల 3 సంవత్సరాలు వృథా అవుతుందని వెంటనే జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పీపీపీ మోడ్‌లో నిర్వహించడమంటే ప్రైవేటీకరణ చేసే ప్రయత్నమేనని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తున్నారని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేకనే పాలిటెక్నిక్ విద్యార్థులను ప్రైవేట్ వైపు లాక్కెళ్తున్నరని విమర్శించారు.ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తున్న స్కిల్ వర్సిటీ పరిధిలోకి పోతే ఫీజులు భారీగా పెరిగే అవకాశం ఉంది అని అన్నారు. గతంలో లాగా ఇంజినీరింగ్ 2వ సంవత్సరంలోకి నేరుగా చేరే అవకాశం విద్యార్థులు కోల్పోనున్నారని అన్నారు.ఇంజినీరింగ్ చేయాలంటే మళ్లీ రెండేళ్లు ఇంటర్ చదవాల్సిన దుస్థితిలో పాలిటెక్నిక్ విద్యార్థులకు కల్పించారని అన్నారు.డిప్లొమా కోర్సులను ఐటీఐ, ఏటీసీలతో కలిపి డిప్లొమా విద్య ప్రాధాన్యత తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్కిల్ యూనివర్సిటీలో విలీనమైతే ఎవరికీ ఉద్యోగాలు రావు అని అన్నారు.తక్షణమే విద్యార్థుల వ్యతిరేక విధానాలను మానుకొని తక్షణమే శక్తిపాలసిన రద్దు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పోరాటం ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థి సంఘాల నాయకులు కిషోర్,భాను ప్రకాష్, ప్రణయ్, సాత్విక్, అఫ్రూజ్ స్వామి, రమేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఇటలీలో సత్తా చాటిన తెలంగాణ సెయిలర్లు



హైదరాబాద్, ఆగస్ట్ 19 (విజన్ ఆంధ్ర) : ఇటలీలోని లేక్ గార్డాలో జరిగిన అంతర్జాతీయ క్యాడెట్ క్లాస్ అండర్-17 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన ఎనిమిది మంది సెయిలర్లు భారత్‌కు 16 పతకాలు సాధించారని తెలంగాణ సేలింగ్ అసోసియేషన్, యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు సుహైమ్ షేక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సిల్వర్ ఫ్లీట్‌లో చంద్రలేఖ తట్టారి-రిష్విత సుంచన్‌కోట జోడీ రజతం సాధించగా, రవికుమార్ బన్నేఒలు-బద్రినాథ్ నిరుడు జోడీ 8వ, వినోద్ దండు-మణి నిల్కొండ్ల 11వ, కౌనిక్ వర్ధన్-హనుమంత్ వధ్యా 20వ స్థానాల్లో నిలవగా, రవికుమార్ ఒక రేసులో మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఉద్భవ్ స్కూల్ విద్యార్థులు రవికుమార్, చంద్రలేఖ, మణి, నల్లకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థి వినోద్, బన్సీలాల్‌పేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి బద్రినాథ్, గురుకుల విద్యార్థులు రిష్విత, హనుమంత్, కౌనిక్ వర్ధన్ ఈ విజయాన్ని అందించారని పేర్కొన్నారు.


# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న తహసిల్దార్ ఎన్. జ్యోతి, ఎస్సై గురు స్వామి



అయిజ ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అయిజ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వేడుకలు జరుపుకున్నారు. ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యు రే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అయిజ మండల తహసిల్దార్ ఎన్. జ్యోతి, ఎస్సై గురు స్వామి హాజరయ్యారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆసుపత్రి వైద్యులు శ్వేతా,హారిక,సూపర్వైజర్ ఓబులేష్, మండల ఫోటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నాయకులు రామకృష్ణ, మల్లికార్జున్, తిరుమలేష్, మహేష్, భాష తదితరులు పాల్గొన్నారు.

# మన పెన్షన్ హక్కుల కోసం సంఘటితంగా పోరాడదాం

**- ఆల్ ఇండియా ఎస్ బి ఎస్ ఎన్ ఎల్ డిఓటి పెన్షనర్స్ అసోసియేషన్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 19,(విజన్ ఆంధ్ర ) : ఎన్సిసిపిఏ, ఎఫ్సిపిఏ కేంద్ర కమిటీ పిలుపు మేరకు పోరాట కార్యక్రమాన్ని బుధవారం ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్, డి ఓ టి పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాన్ని చేపట్టారు. సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుమార్ బాబు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ కార్యాలయ ఏ డి ఈ ప్రకాష్ కు11 డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సందర్భంగా కుమార్ బాబు మాట్లాడుతూ 2025 పెన్షన్ ధృవీకరణ చట్టాన్ని రద్దు చేయాలని, 8వ కేంద్ర వేతన సంఘం తిరోగమనను సవరించి 2026 కు ముందు పెన్షనర్లకు పెన్షన్ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిదవ వేతన సవరణ అయ్యేంతవరకు ఇంటీరియల్ రిలీఫ్ ప్రకటించాలన్నారు. అంతేకాకుండా బ్యాంకు పెన్షన్ అప్డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలిండియా బిఎస్ఎన్ఎల్ డాట్ ఆదిలాబాద్ జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు జిల్లా బ్రాంచ్ అధ్యక్షులు సక్కు కార్యదర్శి లింగయ్య తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ అధ్యక్షులు కే. ప్రభాకర్, జనరల్ సెక్రెటరీ జి. చక్రధర్ రావు, కోశాధికారి ఎ. శంకరయ్య, ఉపాధ్యక్షులు కే ఎం ఎస్ రెడ్డి, బోనగిరి రాజిరెడ్డి, ఎం.పాండురంగ బి. కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 'సర్ ఓటర్ల జాబితా'ప్రక్రియ ఓ... ఆల్ పార్టీ మీటింగ్




మల్కాజిగిరి, ఆగస్ట్ 19, (విజన్ ఆంధ్ర): మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ సంచిత్ గగర్వాల్, డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా ఆధ్వర్యంలో బుధవారం 'సర్ ఓటర్ల జాబితా'ప్రక్రియ పై ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వివిధ పార్టీల నాయ కులు కాసర్ల నాగరాజు, టి.యాదయ్యగౌడ్, బి. యాదగిరి, జె.వెంకటరమ ణ, కరణం గోపి, ఒగ్గు చంద్ర శేఖర రావు, పిట్టల శ్రీని వాస్, జీడి నవీన్ గౌడ్, జీనుకుంట్ల రమేష్, రామ కృష్ణ, ఎస్.శ్రీనివాస్, జి. గౌతమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, బాలికల కోసం "సమ్మిళిత నగరాలు" ప్రాజెక్టు.

**- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.**



ములుగు ఆగస్టు 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయంలో నిర్వహించిన బిజిల్లా నిర్భయ ఫండ్ కమిటిబి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్భయ ఫండ్ ద్వారా బి"మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు"బి పైలట్ ప్రాజెక్ట్ ను ములుగు జిల్లాలో చేపడుతున్నామని తెలిపారు. మహిళలు, బాలికలు సురక్షితంగా జీవించడానికి, చదువుకోవడానికి, పని చేయడానికి, ప్రయాణించడానికి అనుకూలంగా ఉండే మహిళా–స్నేహపూర్వక పట్టణ ప్రదేశాలను రూపొందించడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు. భద్రత, రవాణా, ప్రజా ప్రదేశాలు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్య, ఉపాధి, నిర్ణయాధికారం వంటి రంగాల్లో మహిళలు ఎదుర్కొనే సమస్యలను ఈ ప్రాజెక్ట్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. ప్రజా మౌలిక సదుపాయాలు, భద్రతా యంత్రాంగాలు, అవగాహన కార్యక్రమాలతో పాటు పట్టణ ప్రణాళికలో మహిళల భాగస్వామ్యం పెంచుతామని తెలిపారు. జిల్లాలో మహిళలు, బాలికల సురక్షిత అవసరాలపై ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని, అనుమతి వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని కమిటీ తెలిపింది. ఈ సమావేశంలో సంక్షేమ అధికారి ఇ.పి. ప్రేమలత, డిఎస్పి కిషోర్ కుమార్, ఆర్టీఓ తాకూర్ ఈశ్వర్ సింగ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, సఖి కేంద్రం అడ్మిన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కపై అసత్య ప్రచారాలు తగదు.

**- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి మధు.**



ములుగు ఆగస్టు 19 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంత్రి సీతక్క పై గత కొద్ది రోజులుగా సాగుతున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామని యూత్ కాంగ్రెస్ మండల్ అధ్యక్షులు బిబండి మధుబి అన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకులు పెయిడ్ ఆర్టిస్టులను రంగంలోకి దించి ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ములుగు నియోజకవర్గానికి ఎంత బడ్జెట్ తెచ్చారు? ఎన్ని అభివృద్ధి పనులు చేశారు? అని ప్రశ్నించారు. గత రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ములుగులో జరిగిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమని, నియోజకవర్గంలోని ఏ గ్రామానికైనా రావడానికి యువజన కాంగ్రెస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఏసీ గదుల్లో కూర్చుని మీడియా ముందు ప్రచారాలు చేయడం కాదని, ప్రజల్లోకి వెళ్లి మాట్లాడాలని సూచించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, మంత్రి సీతక్క పై మరోసారి అసత్య ప్రచారాలు చేస్తే యువజన కాంగ్రెస్ తగిన రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, దేవేందర్, రవీందర్, సురేందర్, నవీన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

**- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్**



ములుగు ఆగస్టు 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంత్రి సీతక్క పై, ములుగు జిల్లా సాధనపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బిభానోత్ రవిచందర్బి అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బిపైడాకుల అశోక్బి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి బిసత్యవతి రాథోడ్బి కలెక్టరేట్ భవనంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బీఆర్ఎస్ హయాంలో శంకుస్థాపన మాత్రమే చేసి వదిలేశారని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మంత్రి సీతక్క చొరవతో నిర్మాణం పూర్తి చేసి సీఎం బిరేవంత్ రెడ్డిబి చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని, మంత్రిపై మరోసారి అసత్య ప్రచారాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిమార్కెట్ చైర్మన్ రేగ కల్యాణి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## గృహిణుల శక్తిని గుర్తించి గౌరవం కల్పించడమే లక్ష్యం



హైదరాబాద్, ఆగస్ట్ 19 (విజన్ ఆంధ్ర) : గృహిణుల నిస్వార్థ సేవలు, కనిపించని శ్రమకు గౌరవం కల్పించే లక్ష్యంతో టాటా టీ చక్ర గోల్డ్ 'ఘనం సోచ్' పేరుతో కొత్త ప్రచారాన్ని ప్రారంభించిదని టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్యాకేజ్డ్ బేవరేజెస్ అండ్ ఆర్గానిక్ ఇండియా ప్రెసిడెంట్ శరత్ వర్మ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ జీతం లేకపోయినా కుటుంబాన్ని తీర్చిదిద్దడంలో గృహిణుల పాత్ర కీలకమనే సందేశాన్ని ఈ ప్రచారం అందిస్తుందని పేర్కొన్నారు. గృహ రుణం నేపథ్యంలో రూపొందించిన ప్రచార కథనం ద్వారా 'పని'కి ఉన్న సంప్రదాయ నిర్వచనాన్ని సవాలు చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ తమకు కీలక మార్కెట్ అని, 'ఘనం టీ, ఘనం ఆలోచనను ప్రేరేపిస్తుంది' అనే బ్రాండ్ నమ్మకానికి 'ఘనం సోచ్' సహజ కొనసాగింపని తెలిపారు. గృహిణుల నిశ్శబ్ద శక్తిని గుర్తించి, వారి కృషికి గౌరవం కల్పించడమే ప్రచారం ఉద్దేశమన్నారు.

# 22 ఏ నిషేధిత భూముల జాబితా తప్పిదాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆ పదవి నుంచి తప్పుకోవాలి : మాజీమంత్రి హరీష్ రావు

**- 22 ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



మల్కాజిగిరి, ఆగస్ట్ 19,(విజన్ ఆంధ్ర): 22 ఏ నిషేధిత భూముల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆ పదవి నుంచి తప్పుకోవాలని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు డిమాండ్ చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో 22 ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చిన భూములను వెంటనే తొలగించి, ప్రజలకు క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కోరుతూ మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కీలక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ రావు మాట్లాడు తూ...సమస్యలను పరిష్కరిం చాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలకు కొత్త సమస్యలను సృష్టిస్తోందని దుయ్య బట్టారు. రాత్రికి రాత్రే కాలనీలకు కాలనీ లను 22 ఏ నిషేధిత జాబితాలో చేరిస్తే ప్రజలు ఎక్కడికి పోవాలి....? అని ఆయన నిలదీశారు. 2008 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యుఎల్ సీ ను రద్దు చేసిన తర్వాత, అనేక భూములు పట్టా భూము లుగా మారి, ఏళ్లు తరబడి ప్రజలు వాటిపై హక్కులతో నివసిస్తు న్నారన్నారు. ఇన్నేళ్లుగా లేని సమస్యను ఇప్పుడు ఎందుకు సృష్టించారని ఆయన ప్రశ్నించారు.రంగారెడ్డి జిల్లాలో జీఓ 7500 ద్వారా మినహాయింపు పొందిన భూములు, మేడ్చల్లో వేలాది భూములు, హెచ్ ఎండీఏ , హుడా పరిధిలోని భూములను కూడా నిషే ధిత జాబితాలో చేర్చారని ఆయన తెలిపారు. ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా భూములను 22ఏ జాబితాలో చేర్చడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారని ఆవేదన చెందారు. భూమి ని విక్రయించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే వరకు తమ భూమి 22 ఏ జాబితాలో ఉందనే విష యం కూడా ప్రజలకు తెలియడం లేదన్నారు. తిలక్‌నగర్‌కు చెందిన అశోక్ అనే వ్యక్తి తన 450 గజాల ఇంటిని విక్రయిం చేందుకు వెళ్లిన సమయం లో అది నిషేధిత జాబితా లో ఉన్నట్లు తెలిసిందని, ఈ ఘటన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు చక్కటి ఉదాహరణ మాత్రమే అన్నారు. బిగ్ టీవీ జర్నలిస్ట్ అశోక్ తనకు ఎదురైన సమస్యను సోషల్ మీడియా ద్వారా వెల్లడిం చారని, ఆయన ఒక్కరే కాకుండా అనేక మంది జర్నలిస్టులు, సామాన్య ప్రజలు ఇదే తరహా సమ స్యలను ఎదుర్కొంటు న్నారని హరీష్ రావు వెల్లడించారు. తప్పు చేసి ఇప్పుడు సారీ చెబితే, ప్రజల బాధలు తీరతా యా.. ? భూములను జాబితాలో చేర్చింది ఎవరు...? ఎవరి ఆదేశా లతో చేర్చారు? అధికారుల పేర్లు చెప్పి ప్రభుత్వం బాధ్య త నుంచి తప్పించు కోకూ డదన్నారు. 22 ఏ నిషేధిత భూముల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిన భూము లను, ప్రజల నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకోకుండా, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా స్వయంగా పరిశీలించి తొలగించాలని హరీష్ రావు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదని తెలిపారు. 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలు, తొలగించిన భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచి, వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ సంబంధిత మంత్రిపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని, లేక పోతే ప్రజల్లో అనుమా నాలు మరింత బలపడ తాయన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే, తప్పు చేసిన కాంగ్రెస్ నాయకులను చట్టపరంగా బాధ్యులను చేస్తాం. 22 ఏ నిషేధిత భూముల సమ స్యపై అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు అండగా నిలుస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ ప్రజలకు ఎప్పుడూ అందు బాటులో ఉంటుందని, 22 ఏ సమస్యతో బాధపడుతు న్న వారు తమ సమస్యల ను బీఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, 22 ఏ నిషేధిత జాబితా కారణంగా మల్కాజిగిరి నియోజక వర్గంలో దాదాపు 30 వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నా యన్నారు. ఎన్నో ఏళ్లుగా పేద, మధ్యతరగతి ప్రజలు కష్టపడి సంపాదించి కొనుగోలు చేసిన భూములను అవసరాల కోసం విక్రయించేందుకు వెళ్లినప్పుడు అవి 22 ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలియడంతో రిజిస్ట్రేషన్లు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల వివాహాలు, ఉన్నత విద్య, వైద్య ఖర్చులు, ఇతర అత్యవసర అవసరాల కోసం తమ సొంత ఆస్తులను విక్రయిం చు కోవాలనుకున్నా, రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి, 22 ఏ నిషేధిత జాబితాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మా రెడ్డితో పాటుగా,మాజీ కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్, సబితా అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాముయాదవ్, జగదీష్ గౌడ్, శిరీష జితేందర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకు లు బద్దం పరుశురాంరెడ్డి, జీకే హనుమంతరావు, జె.ఎ.సి. వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, డోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, భాస్కర్ రెడ్డి, భాగ్యనంద్ రావు, ఉస్మాన్, శివ గౌడ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, చిన్నం శ్రీనివాస్, రమే ష్, రాజుయాదవ్, శోభన్ బాబు, ఢిల్లీ పరమేష్, సురేష్, బాలకృష్ణ, ఫరీద్, వంశీ ముదిరాజ్, రాజశేఖర్ రెడ్డి, జక్కుల కిరణ్, అనిల్, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్ యాదవ్, కిట్టు, బిక్షపతి, కనకరాజు, ఖలీల్, భాగ్యనందరావు, దినేష్, నవాబ్, మహేష్, మారుతి ప్రసాద్, అలాగే వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, 22 ఏ నిషేధిత జాబితా బాధితులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెండ్, సర్పంచ్ ఉప సర్పంచ్లకు షోకాస్ నోటీసులు జారీ!

**- ఎత్తం పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఇద్దరు కార్యదర్శులపై వేటు**
**- ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు**
**- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్**



కోడేరు /కొల్లాపూర్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగ ఆరోపణలపై నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఘన చర్యలు చేపట్టారు. కోడేరు మండలం ఎత్తం, ఎర్రన్నబావి తాండ గ్రామపంచాయతీలకు చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసి, ఎత్తం గ్రామ సర్పంచ్ బి. లక్ష్మి , ఉపసర్పంచ్ బి. ధర్మరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా, జిల్లా పరిషత్ అధికారి శ్రీరాములు ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాజాగా ఎత్తం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రమేష్ , గతంలో ఎత్తం కార్యదర్శిగా ఉన్న తర్వాత ప్రస్తుతం ఎర్రన్నబావి తాండ కార్యపంచాయతీ కార్యదర్శిగా ఉన్న బి. నరసింహాను సస్పెండ్ చేశారు. కేంద్ర , రాష్ట్ర స్థాయిల నుంచి మంజూరు చేసిన గ్రామపంచాయతీ అభివృద్ధి నిధుల వినియోగంలో నిబంధనలు ఉల్లంఘించబడ్డట్లు సంబంధిత పత్రాలు, బిల్లులు, చెల్లింపుల రికార్డులు, అభివృద్ధి పనుల అమలు వివరాలపై గుర్తించిన అనుమానాలకు అనుగుణంగా సమగ్ర విచారణ మొదలుపెట్టారు.జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు చెప్పారు: "నిధుల వినియోగం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, బిల్లుల చెల్లింపుల వివరాలపై రికార్డులను పరిశీలించిన అనంతరం కలెక్టర్ సరైన చర్యలు ప్రకటించారు. ప్రభుత్వ నిధులను ప్రజల సంక్షేమానికి మాత్రమే, నిబంధనలకు అనుగుణంగా వినియోగించడం తప్పనిసరి. అని" విభాగ అధికారులు ప్రస్తుతం ఎత్తం గ్రామపంచాయతీకి సంబంధించిన ఖాతా రికార్డులు, బిల్లుల ప్రతులు, పనుల ప్రగతి నివేదికలు, చెల్లింపుల ఆధారాలను కొలమానం చేస్తున్నారు. విచారణలో నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే బాధ్యులపై మరిన్ని శాఖాపరమైన చర్యలు, అలాగే అవసరమైతే న్యాయ సంబంధమైన చర్యల గురించి కూడా ఆలోచించబడుతుందని శ్రీరాములు చెప్పారు.

## ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వారికే కేటాయించాలి

**- కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**




ములుగు ఆగస్టు 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, సబ్ ప్లాన్ నిధులు వారికే కేటాయించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బిబక్కి వెంకటయ్యబి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ బిబోర్కడే హేమంత్బి, ఎస్పీ బిసుధీర్ రామ్ నాథ్బి తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని, జనాభా ప్రాతిపదికన ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించి, ఎస్సీ, ఎస్టీల సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల్లో వారికి తగిన వాటా ఇవ్వాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టడంలో పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

**- ఎస్పీ సుధీర్ రామ్నాథ్**




ములుగు ఆగస్టు 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లా ఎస్పీ బికేకాన్ సుధీర్ రామ్నాథ్, ఐపీఎస్బి బుధవారం జిల్లా కేంద్రంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని, రౌడీషీటర్లను ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలపై నిఘా పెంచాలని, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ బిమనన్ భట్బి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ములుగులో ఇసుకాసురుల హవా - ప్రభుత్వ ఆదేశాలు గాలికే.....

**- గిరిజనుల ఉపాధి దోచేస్తున్న ఇసుక మాఫియా - తనిఖీలెక్కడ?**



ములుగు ఆగస్టు 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లాలో ఇసుక అక్రమాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. గిరిజన ఉపాధి కోసం ఏర్పాటు చేసిన సొసైటీ రీచ్‌లను బినామీ కాంట్రాక్టర్లు ఆక్రమించి అక్రమ తరలింపు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో నాణ్యమైన ఇసుకకు పేరున్న ములుగులో ప్రభుత్వం 30 కొత్త రీచ్‌లకు అనుమతులిచ్చింది. వీటిలో 23 వెంకటాపురం, 7 మంగపేట మండలాల్లో ఉన్నాయి. ఈ రీచ్‌ల్లో ఎక్కువ భాగం అధికార పార్టీకి అనుకూల వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం మాన్యువల్ పద్ధతిలో ఇసుక తీయాల్సి ఉండగా, భారీ యంత్రాలతో రాత్రి, పగలు తేడా లేకుండా గోదావరి గర్భం నుంచి ఇసుక తోడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీసీ కెమెరాల కరెంట్ కట్ చేయడం, మీడియాను అడ్డుకోవడం, కేసులు బనాయిస్తామని బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అంశంపై బీఆర్ఎస్ నేతలు మంత్రి సీతక్క పై నేరుగా ఆరోపణలు చేశారు. సీతమ్మధార ప్రాజెక్టు పేరుతో 4000 కోట్ల అవినీతి జరిగిందని మాజీ రెడ్ క్రాస్ చైర్మన్ బిసతీష్ రెడ్డిబి అన్నారు. దీనిపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క ఇసుక అక్రమాలను సహించబోమని స్పష్టం చేసినా, జిల్లా స్థాయిలో చర్యలు కనిపించడం లేదు. గత ఏడాదిలో టీజీఎండీసీ పీఓలు ముగ్గురు బాధ్యతలు మారడం, తనిఖీకి వెళ్లిన అధికారి కూడా చర్యలు తీసుకోకపోవడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్, రెవెన్యూ, మైనింగ్, టీజీఎండీసీ అధికారులు ఉమ్మడి తనిఖీలు చేపట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మందు బాబులకు అడ్డగా మారిన మల్కాజిగిరి

**- విచ్చల విడిగాగంజాయి అమ్మకాలు**
**- జోరుగా బెల్ట్, గుట్కాపాన్ మసాల షాపుల నిర్వహణ**
**- పెడదోవ పడుతున్న యువత**
**- కొరవడిన పోలీస్ పెట్రోలింగ్ నిఘా**

మల్కాజిగిరి, ఆగస్ట్ 19,(విజన్ ఆంధ్ర): మల్కాజ్గిరి, నేరేడ్మెట్, వినాయక నగర్, మౌలాలి, డివిజన్ లలో పలు ప్రాంతాలు మందు బాబులకు అడ్డగా మారిపోయాయి. ఏ గల్లిలో చూసినా బ్లాక్ లో మందు అమ్మడంతో మందు బాబులకు వరంగా మారింది.. అలాగే పలు ప్రాంతాల్లో గంజాయి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరసిల్లుతుంది. గంజాయికి యువకులే టార్గెట్గా మారుతున్నారు. దీంతో బీద, మధ్యతరగతి కుటుంబాలు చిన్నా భిన్న మవుతున్నాయి. వాజ్ పేయినగర్ రైల్వే గేటు దగ్గరలో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. దీనికి తోడు కొన్ని ప్రాంతాల్లో అక్రమ బెల్ట్ షాపులతో పాటు, గుట్కా, పాన్ మసాలా, ఇతరత్రా మత్తు పదార్థాల స్థావరాలు విచ్చలవిడిగా చలామణిలో ఉండడంతో మద్యం, గంజాయి, గుట్కా, పాన్ మసాలా మత్తులో (18 నుండి 26) వయసు లోపున్న యువత బానిసలవుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పోలీసుల పెట్రోలింగ్ వాహనం తిరగక పోవడంతో గంజాయి బ్యాచ్ ఆగడాలు మరీ ఎక్కువవుతున్నాయి. అక్రమంగా చలామణి అవుతున్న గంజాయి, బెల్ట్ షాప్ స్థావరాలపై పోలీసులు సరైన నిఘా కొరవడడంతో పాటు నిర్వాహకుల వద్ద అమ్యామ్యాలకు అలవాటు పడడంతోనే వారి దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతుందని, దీంతో పలు ప్రాంతాలలో గంజాయి బ్యాచ్ ఆకతాయిల చేష్టలు రోజురోజుకూ మితి మీరిపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ ల తిష్ట మధ్యాహ్నం నుంచే ఆరంభం అవుతుండగా, మరి కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం, అర్ధరాత్రి వరకూ గంజాయి బ్యాచ్ లు ప్రధాన కోడళ్లలో, ఇండ్ల ముందు అరుగులపై కూర్చొని వచ్చిపోయే అమ్మాయిలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ నానా రభస చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని అడిగితే ఇది మా ఇష్టం... మీరెవరు మమ్మల్ని అడగడానికి అంటూ కొందరు బూతులతో ఘర్షణలకు దిగుతూ రాద్ధాంతం సృష్టిస్తున్నారని పలువురు బహిరంగంగానే ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. ఇకనైనా వీరిఆగడాలకు అడ్డుకట్టు వేయకపోతే రాబోయే రోజుల్లో భయంకరమైన ఆఘాయిత్యాలు, ఆకృత్యాలు జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఆటోలు , ద్విచక్రవాహనాలపై ఈ గంజాయి బ్యాచ్ లు సంచరిస్తూ పేకాడుతూ గంటల కొద్ది తిష్టవేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోయారు. బతుకుదెరువు కోసం వివిధ రాష్ట్రాలు నుంచి వచ్చిన వారే అధికంగా వ్యసనాల పట్ల ఆకర్షితులై గంజాయికి బానిసలు అవుతున్నారని, వారు ఇక్కడి వారితో స్నేహం చేసి వ్యసనాలకు మరింత అలవాటు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే గంజాయి రవాణాకి అడ్డుకట్టు వేస్తూ పోలీసుల నిఘా కట్టుదిట్టం చేయా లని, పలు ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్న బెల్ట్ షాపులు, గుట్కా స్థావరాలపై మెరుపు దాడులు చేయాలని పలువురు కోరుతున్నారు.



# దేవతామూర్తుల ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు



అయిజ ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కుటుకనూరు గ్రామంలో శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయ, వినాయక, శివపార్వతి దేవి, నందీశ్వర, నవగ్రహ, నాగదేవత, ధ్వజస్తంభ, మరకత లింగం ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని, దేవతామూర్తులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కి, ఎమ్మెల్యే విజయుడు కి శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ మహోత్సవంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వావిలాల రంగారెడ్డి, ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోడుప్పల్‌లో ఘనంగా పోచమ్మ అమ్మవారి విగ్రహ పున ప్రతిష్ఠాపన మహోత్సవం

**- గణపతి హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు**



బోడుప్పల్, ఆగస్టు 19(విజన్ ఆంధ్ర): బోడుప్పల్‌లోని శ్రీశ్రీ చిత్తరామ పోచమ్మ అమ్మవారి దేవాలయంలో నూతన దేవాలయ ప్రారంభోత్సవం, విగ్రహ పున ప్రతిష్ఠాపన మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, కలశ స్థాపన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల్లో భాగంగా 20న వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 21న నూతన దేవాలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠాపన, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీ.సీ.ఆర్.బి సెక్షన్ లో సమగ్ర సమీక్ష నిర్వహించిన పోలీస్ కమీషనర్



నిజామాబాద్ ఆగస్టు19:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో బుధవారం నాడు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని సీ.సీ.ఆర్.బి (CCRB) సెక్షన్‌ను గౌరవనీయులు లినిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్.,క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీ.సీ.ఆర్.బి సెక్షన్‌లో నిర్వహిస్తున్న కేసుల నమోదు , నేర గణాంకాలు , దర్యాప్తు పురోగతి , పెండింగ్ కేసులు , కోర్టు కేసులు , పోలీస్ స్టేషన్ల నుంచి అందుతున్న కేసుల వివరాలు , రికార్డుల నిర్వహణ తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ల వారీగా కేసుల వివరాలను సమీక్షిస్తూ , పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేసులకు సంబంధించిన రికార్డులు , గణాంకాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే నేరాలపై సమగ్ర గణాంకాలను సిద్ధం చేసి , వాటి ఆధారంగా నేర నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. సీ.సీ.ఆర్.బి విభాగం , పోలీస్ స్టేషన్ల మధ్య సమన్వయం మరింత మెరుగుపరచి , కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని కమిషనర్ సూచించారు. కేసుల దర్యాప్తు మరియు పురోగతికి సంబంధించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు సకాలంలో అందిస్తూ , పోలీసు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా కొనసాగించేలా సీసీఆర్బీ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీ ఎన్. శుభం ప్రకాష్ , సి.సి.ఆర్.బి ఏ.సి.పి శ్రీ బి. గురు నాయుడు , సిఐ శ్రీ ఆర్. అంజయ్య , శ్రీ పాండేరావు, ఎస్సై శ్రీ జే. వరప్రసాద్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఓల్డ్ అల్వాల్ లో డిసి భోగేశ్వర్లు పర్యటన



అల్వాల్, ఆగస్ట్ 19,(విజన్ ఆంధ్ర): ఓల్డ్ అల్వాల్ చౌర స్తాలో బుధవారం డిసి భోగేశ్వర్లుతో కలిసి కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీ కాంత్ రెడ్డి మాట్లాడుతూ...ఇక్కడ రోడ్డు వెడల్పు దృష్ట్యా ఇందిరాగాంధీ విగ్రహం తరలింపు, సమస్యలపై డిసి భోగేశ్వర్లతో చర్చించారు. త్వరలోనే ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని డీసీ తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో డి ఈ మహేష్, ఏఈ రవళి, స్థానిక నాయకులు తోట లక్ష్మీకాంతరెడ్డి, బొబ్బిలి సురేందర్ రెడ్డి, నాగేశ్వర రావు, సూర్యకిరణ్, లడ్డు రెడ్డి, బలవంత రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రహదారుల అభివృద్ధితో ఉపాధి అవకాశాలు

**-రైతుల ఉత్పత్తుల రవాణాకు మెరుగైన రోడ్లు**
**- హైదరాబాద్ - రామగుండం గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై కసరత్తు**
**- రైతులు ఆయిల్‌పామ్, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి**
**- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**





పెద్దపల్లి జిల్లా ప్రతినిది ఆగస్టు-19(విజన్ ఆంధ్ర) సుల్తానాబాద్ మండలం గర్రేపల్లిలో రూ.219.67 కోట్ల విలువైన హెచ్ఏఎం, నాన్‌ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యాపారాలు విస్తరించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. రాష్ట్రంలో ఆర్అండ్‌బీ పరిధిలో రూ.13 వేల కోట్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.17 వేల కోట్లతో రహదారి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. హెచ్ఏఎం విధానంలో ప్రభుత్వం 40 శాతం, కాంట్రాక్టర్ 60 శాతం నిధులతో పనులు చేపడుతున్నామని, రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. పెద్దపల్లి బైపాస్‌కు రూ.82 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గత పదేళ్లలో పెద్దపల్లి జిల్లాకు రూ.900 కోట్ల రహదారి పనులు మాత్రమే మంజూరైతే, ప్రస్తుత ప్రభుత్వం రూ.1,700 కోట్ల పనులు మంజూరు చేసిందన్నారు. వీటితో రైతులు, వ్యాపారులు తమ ఉత్పత్తులను వేగంగా రవాణా చేసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వ విప్ విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో జూలపల్లి, కాల్వ శ్రీరాంపూర్, గంగారం, ఉషన్నపల్లి, పాండిల్ల ప్రాంతాల్లో పలు రహదారి పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. పెద్దపల్లి బైపాస్‌ను ఏడాదిలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సుల్తానాబాద్ బైపాస్ నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రులను కోరారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రభుత్వం కఠిన ఆర్థిక పరిస్థితుల్లోనూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. రైతులు ఎల్‌నినో పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగించి ప్రత్యామ్నాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగును పెంచాలని సూచించారు. హైదరాబాద్‌రామగుండం గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో సుల్తానాబాద్ బైపాస్‌ను చేర్చేందుకు కృషి చేస్తామని మంత్రులు తెలిపారు. రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణ, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, గోదావరిఖని డిప్యూటీ మేయర్ పారుపల్లి ఎల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయం పెంచేందుకు ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలి

**- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.**





మహబూబ్ నగర్ ఆగస్టు 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : రైతుల ఆదాయం పెంచడంతో పాటు నీటి వనరులు, భూసారాన్ని పరిరక్షించేందుకు ఉద్యానవన, తక్కువ నీటి వినియోగ పంటల సాగును ప్రోత్సహించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం భూత్పూర్ మండలం శేరిపల్లి గ్రామంలో జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో రైతులకు, గ్రామ సర్పంచ్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్ సి.ఎం.డి జితేష్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితులు మారి వర్షాభావం ఏర్పడుతున్నందున వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు తదితర పంటల సాగుపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లిఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిలి మాట్లాడుతూ పంటల మార్పిడి, ఆధునిక సాగు పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు. తక్కువ వర్షపాతం, భవిష్యత్ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే పంటలను ఎంచుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన కూరగాయల నారు, విత్తనాలు, మల్చింగ్, పందిళ్ల సాగు వంటి సదుపాయాలను ప్రభుత్వం అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు సమూహాలుగా ఏర్పడి సాగు వివరాలను ఉద్యానవన శాఖకు అందిస్తే అవసరమైన నారును తెప్పించి అందించే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, కొత్తకోట సమీపంలోని శంకరెడ్డిపల్లిలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే మార్కెటింగ్ సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీలు త్వరగా మంజూరు చేయాలని అధికారులను కోరారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గంలోని గ్రామాల్లో తక్కువ వోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు తదితర సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారి టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్. సి.ఎం డి. జితేష్ పాటిల్ ను కోరారు. అలాగే బూత్‌పూర్‌లో విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్ సి.ఎం.డి జితేష్ పాటిల్‌లి మాట్లాడుతూ వ్యవసాయాన్ని కేవలం ఒకే పంటకు పరిమితం చేయకుండా పాడి, మేకల పెంపకం, చేపలు, తేనెటీగల పెంపకం, ఉద్యాన పంటలు, కూరగాయలు వంటి అనుబంధ రంగాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కొత్త పంటలను ముందుగా చిన్న విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా సాగు చేసి, ఫలితాలను బట్టి విస్తరించాలన్నారు. మార్కెట్ అవకాశాలను ముందుగానే గుర్తించి ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మట్టిని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని, పంట అవశేషాలను కాల్చకుండా సేంద్రియ పదార్థాలుగా మార్చి భూమికి అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, అనిశ్చిత వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగు విధానంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. వరి, పత్తితో పాటు కూరగాయలు, పూలు, ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, నువ్వులు, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తమ గ్రామాల్లో కొంతమంది రైతులతో ప్రయోగాత్మకంగా పంటల మార్పిడిని ప్రారంభించి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం, విత్తనాలు, వ్యవసాయ సమాచారం అందించేందుకు జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతకు ముందు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్‌లి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఉద్యానవన శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను, రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీల గురించి వివరించారు. తక్కువ నీటితో సాగయ్యే కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను రైతులు చేపట్టాలని సూచించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్, మల్చింగ్, పందిళ్లు, నాణ్యమైన నారు వంటి సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. స్థానిక మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను ఎంచుకుని ముందస్తు మార్కెటింగ్ ప్రణాళికతో సాగు చేయాలని సూచించారు. తొలుత, కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, సి. ఎం .డి జితేష్ పాటిల్ తో కలిసి శేరిపల్లి రైతులు వీరస్వామి, లక్ష్మయ్య సాగు చేస్తున్న కాకరకాయ, చిక్కుడుకాయ తోటలను పరిశీలించారు. రైతులు ఎకరాకు సుమారు రూ.20 వేల పెట్టుబడితో సాగు చేస్తున్నామని, అనుకూల దిగుబడి వస్తే మూడు నెలల్లో సుమారు రూ.2 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. అనంతరం ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి సాగు ఉపకరణాలు, తేనె ఉత్పత్తులు, రైతులకు అందించనున్న కూరగాయల నారును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాలకోటి, వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, గ్రామ సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

**- అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి.**
**- పిఎసి సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క**





నిజామాబాద్ ఆగస్టు19:( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పిఎసి సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల ఎంకే గార్డెన్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క తో పాటు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నాయకులు ముందుండాలని ఆమె అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి కమిటీలను మరింత క్రియాశీలం చేసి ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని అన్నారు. పార్టీ కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని ఆయన అన్నారు. పార్టీని గ్రామస్థాయి నుండి కొరకు జిల్లా స్థాయి వరకు పటిష్టంగా నిర్మాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లో పార్టీ సశీస్థ గత నిర్మాణాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీకి సంబంధించిన ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ వారికి సేవలు అందించాలన్నారు.ఈ సమావేశంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, ఎమ్మెల్యే మదన్ మోహన్, సునీల్ రెడ్డి, వినయ్ రెడ్డి, యూసుఫ్ అలీ, కాసుల బాలరాజ్, అరికెలనర్సారెడ్డి , ఆకుల లలిత, కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, కార్పొరేషన్ చైర్మన్లు మోహన్ రెడ్డి, ఈరవత్రి అనిల్, కేశ వేణు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నరాల రత్నాకర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైనంపల్లి హనుమంత రావు సహకారంతో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**-సీనియర్ నాయకులు బి. నాగేశ్వర రావు**



అల్వాల్, ఆగస్ట్ 19,( విజన్ ఆంధ్ర): అల్వాల్ డివిజన్ పరిధిలోని రామాలయం వద్ద బుధవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమైనాయి. ఈ పనులను కాంగ్రెస్ పార్టీ అల్వాల్ సీనియర్ నాయకులు బి. నాగేశ్వర రావు, గణేష్, సుధాకర్ రెడ్డి, సాయిరాంగౌడ్, నారాయణ, ఎస్.రాజు,బి. రాజు, వర్క్ ఇన్స్పెక్టర్లు రామారావు చందు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి వినతి మేరకు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు 13 లక్షల రూపాయలు మంజూరు చేయించారని తెలిపారు. దీంతో ఈ రోజు రామాలయం ముందున్న నాగన్న ఇంటి నుండి, కల్లు కాంపౌండ్ వరకు సీసీ రోడ్డు పనులు ప్రారంభమైనాయ ని తెలిపారు. తమ కాలనీలో సీసీ రోడ్డు వేయించిన మల్కాజ్గిరి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డిలకు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు

# తలారి తిరుపతి మరణం పోలీస్ శాఖకు తీరని లోటు.

**- కుటుంబసభ్యులను ఓదార్చిన పోలీస్ కమిషనర్.**
**- అంత్యక్రియలకు హాజరై, నివాళులర్పించిన సీపీ సాయి చైతన్య.**



నిజామాబాద్ ఆగస్టు19:( విజన్ ఆంధ్ర) : పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తలారి తిరుపతి గుండెపోటుతో మృతి మృతి చెందడం పోలీస్ శాఖకు తీరని లోటని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. తలారి తిరుపతి మృతి పోలీసు శాఖను దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెంజల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న తలారి తిరుపతి , హెడ్ కానిస్టేబుల్ : 1549 ( ప్రస్తుతం ఆర్మూర్ ఎ.సి.పి కార్యాలయంలో విధులు ) నిర్వహిస్తున్నారు. తలారి తిరుపతి మంగళవారం ఆకస్మికంగా గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయన మృతి పట్ల పోలీస్ శాఖలో విషాదం నింపింది. తలారి తిరుపతి అంత్యక్రియలు బుధవారం ఆర్మూర్ లో నిర్వహించారు.ఈ అంత్యక్రియలకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తలారి తిరుపతి పార్థివదేహానికి పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి , వారి బాధను పంచుకుని ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. తలారి తిరుపతి మృతి పోలీస్ శాఖకు తీరని లోటని , ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు. అంత్యక్రియలలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ, బోధన్ రూరల్ సిఐ విజయబాబు, రెంజల్ ఎస్సై ఎం గంగాధర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకిల్ పాషా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంత సంరక్షణ కోసం సమన్వయంతో కృషి చేయాలి

**- జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా**

నిజామాబాద్, ఆగస్టు 19 :(విజన్ ఆంధ్ర )జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర



ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా ఇంచార్జి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



నిజామాబాద్, ఆగస్టు 19 :(విజన్ ఆంధ్ర )నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

# ఎఫ్‌సీఐ జీఎం తో ములుగు రైస్ మిల్లర్స్ అధ్యక్షులు "బాదం ప్రవీణ్" భేటీ



ములుగు ఆగస్టు 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : గోదాముల్లో స్థలం, రాక్ మూమెంట్ సమస్యల పరిష్కారానికి బిములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు“ బాదం ప్రవీణ్‌బి“ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో బిఎఫ్‌సీఐ జీఎం అనూజ్ త్యాగిబి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా “ బాదం ప్రవీణ్“ మాట్లాడుతూ, ఎఫ్‌సీఐ గోదాముల్లో తగినంత స్థలం లేకపోవడం, రాక్ మూమెంట్ లేకపోవడంతో బియ్యం డెలివరీలు చేయలేకపోతున్నామని తెలిపారు. దీనివల్ల రైస్ మిల్లర్లు తీవ్రంగా ఆర్థిక నష్టాలు చవిచూస్తున్నామని వివరించారు. వెంటనే గోదాముల్లో స్థలాలు ఏర్పాటు చేయాలని, రాక్ మూమెంట్ చేపట్టాలని జీఎం ను కోరారు. జీఎం అనూజ్ త్యాగి సానుకూలంగా స్పందిస్తూ బిసెప్టెంబర్ నెలలో రాక్ మూమెంట్ చేపడతామనిబి, గోదాముల్లో స్థలాల లభ్యత కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ భేటీలో బిములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదర రెడ్డి, వరంగల్ జిల్లా కార్యదర్శి బూరెల సత్యనారాయణ, కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, మహబూబాబాద్ అధ్యక్షులు కృష్ణమూర్తి, సీనియర్ రైస్ మిల్లర్లు యుగంధర్, శ్రావణ్‌బి తదితరులు పాల్గొన్నారు.

# "ఫోటోగ్రాఫర్లకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తాం"

**- "ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధునిక కోర్సు: రాఘవేందర్ రెడ్డి"**

**- "ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంలో హామీ"**




ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 19: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి డివిజన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ భవన్ లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు & టాస్క్ సి.ఓ.ఓ. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఫోటో, వీడియో గ్రాఫర్లతో ఆత్మీయంగా ముచ్చటించారు.

**ఉచిత నైపుణ్య శిక్షణకు హామీ**

ఈ సందర్భంగా మాట్లాడిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫోటో, వీడియో గ్రాఫర్లకు త్వరలో ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. "కాలంతో పాటు టెక్నాలజీ మారుతోంది. టెక్నాలజీ మారుతున్న కొద్దీ మన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలి. ఫోటోగ్రఫీని వృత్తిగా కొనసాగిస్తున్న వారికి ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి, వారి వృత్తిపరమైన అభివృద్ధికి నా వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను"అని హామీ ఇచ్చారు.

**ఆధునిక సాఫ్ట్‌వేర్, నిపుణులతో శిక్షణ**

శిక్షణ కోర్సులో ఫోటో ఎడిటింగ్, వీడియో ఎడిటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, కలర్ గ్రేడింగ్, సినిమాటోగ్రఫీ, డిజిటల్ కంటెంట్ క్రియేషన్‌లి వంటి ఆధునిక అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇస్తామని తెలిపారు. అంతేకాకుండా శిక్షణకు అవసరమైన అధునాతన సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చి, నిపుణులైన శిక్షకుల ద్వారా ప్రాక్టికల్‌గా శిక్షణ ఇప్పిస్తామని స్పష్టం చేశారు. ఈ శిక్షణ కేవలం సర్టిఫికెట్‌కు పరిమితం కాకుండా, వారి వృత్తిలో నేరుగా ఉపయోగపడేలా, ఉపాధి మరియు ఆదాయ అవకాశాలను మెరుగుపరుచుకునే విధంగా రూపొందిస్తామని చెప్పారు.

**ఫోటోగ్రఫీ రంగం ప్రాముఖ్యత**

ఫోటోగ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, ఫోటోగ్రఫీ



రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. "ఒకప్పుడు జ్ఞాపకాలను భద్రపరచడం మాత్రమే ఉన్న ఫోటోగ్రఫీ, నేడు డ్రోన్ ఫోటోగ్రఫీ, సినిమాటోగ్రఫీ, సోషల్ మీడియా కంటెంట్ క్రియేషన్ వంటి అనేక విభాగాలతో విస్తరించింది. పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ఆధునిక సాఫ్ట్‌వేర్, ఎడిటింగ్, డిజైనింగ్‌పై పట్టు సాధించడం తప్పనిసరి" అని పేర్కొన్నారు.

**యూనియన్ సభ్యుల హర్షం**

ఫోటోగ్రాఫర్లకు ఉచితంగా ఆధునిక నైపుణ్యాలను అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ ముందుకు రావడంపై యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. రాఘవేందర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

**కార్యక్రమంలో పాల్గొన్నవారు:**

ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగినేని రవికుమార్, ఉపాధ్యక్షులు రియాజ్, ప్రధాన కార్యదర్శి నందు, కోశాధికారి వంశీ తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, ప్రతినిధులు, సభ్యులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సన్మానాలు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ( విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ జిల్లా పరిధిలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులకు గౌడ స్వచ్ఛంద సంస్థ నాయకులకు మేధావులకు సన్మానాలు చేయడం జరిగింది. మహబూబాబాద్ జిల్లా పరిధిలోని గంది రాజేష్ కి సన్మానం చేయడం జరిగింది. సన్మాన కార్యక్రమం తదనంతరం వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా నాకు సన్మానం చేయడం ఎంతో సంతోషంగా గర్వంగా ఉందని అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ గడ్డపై జన్మించిన గొప్ప యోధుడని సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడిన ప్రజా నాయకుడని అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని వారు పేర్కొన్నారు. హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి యొక్క జయంతి సందర్భంగా నాకు సన్మానం చేయడం ఎంతో సంతోషదాయకంగా ఉందని వారన్నారు. ఇదేవిధంగా ప్రతి సంవత్సరం సర్దార్ పాపన్న జయంతి వర్ధంతి సభలు నిర్వహించి మన గౌడ కులస్తుల ఎవరైనా నైపుణ్యం గలవారు వ్యక్తులు ఉంటే వారిని ప్రతి సంవత్సర సన్మానం చేయాలని వారు కోరారు .ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు జేరిపోతుల వెంకన్న గౌడ్, మహబూబాబాద్ వార్డు కౌన్సిలర్ ముత్యం వెంకన్న గౌడ్ పెద్ది వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీచుపల్లిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

**- బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

ఎర్రవల్లి ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న కలెక్టర్ కు మొదట ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో, మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయ స్వామి ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు కలెక్టర్ ను సన్మానించి, ప్రసాదాన్ని అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి పురంధర్ బీచుపల్లి క్షేత్ర విశిష్టతను కలెక్టర్ కు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆలయ ప్రాంగణం పరిశీలించి భక్తులను ఆకట్టుకునేలా లైటింగ్, ఇతర అలంకరణ చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో చెత్తాచెదారం, పందులను గమనించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత కోసం అవసరమైన సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మినీ పార్క్, ఫౌంటెన్‌ను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా నిర్వహించాలన్నారు. పరిసరాల్లో ఉన్న ఫంక్షన్ హాళ్లను నిబంధనల ప్రకారం నిర్వహించేలా చూడాలన్నారు.





ఆలయ పరిసరాల్లోని హోటళ్లను నిబంధనల ప్రకారం అవసరమైన ప్రమాణాలతో నిర్వహించాలన్నారు. నిజాం కొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను పర్యాటక శాఖకు పంపించడం జరిగిందన్నారు. నదీతీరంలో సేవలందిస్తున్న గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్లు, టార్చిలైట్లు, రక్షణ తాళ్లు, రెస్క్యూ బోట్ వంటి పరికరాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ పర్యటనలో తహసీల్దార్ నరేష్, ఈఓ పురేందర్, పంచాయితీ కార్యదర్శి అరుణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ బోనాలకు మంత్రి అడ్లూరికి ఆహ్వానం



బోడుప్పల్,ఆగస్ట్19(విజన్ ఆంధ్ర) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ బోడుప్పల్ లో నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ నాయకులతో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లు, కార్యక్రమ వివరాలను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్‌రెడ్డి,మేడ్చల్ జిల్లా బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు సుమన్ భూక్యా, కిరణ్‌కుమార్‌రెడ్డి, చీరాల నర్సింహ్మ,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రాపోలు ఉపేందర్,ప్రధాన కార్యదర్శి చంటి శ్రీనివాస్,గుర్రాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సేవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 21న ఉచిత అయుర్వేద వైద్య శిబిరం నిర్వహించబడును.



భూపాలపల్లి జిల్లా :19 ఆగస్టు ( విజన్ ఆంధ్ర ) సింగరేణి సేవా సమితి భూపాలపల్లి ఏరియా ఆధ్వర్యంలో డా.విశ్వనాథ మహర్షి, ఆయుర్వేద స్పెషలిస్టు నేతృత్వంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిభిరంను ఈనెల 21 న స్థానిక కృష్ణ కాలనీ లోని సి.ఈ .ఆర్ క్లబ్ నందు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏరియా అధికార ప్రతినిధి ఎస్. శ్యాంసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిభిరం ఉదయం 10:00గం.ల నుండి మధ్యాహ్నం 02:00గం.ల వరకు నిర్వహించబడును. (చర్మవ్యాధులకు, మోకాళ్ళ నొప్పులకు, గుండె దడ, బిపి, షుగర్, థైరాయిడ్, మల బద్ధకం, అజీర్ణం, పక్షవాతం, అస్తమా, స్త్రీలకు సంబంధించిన వ్యాధుల నివారణ కోసం ఈ వైద్య శిభిరము ఉచితముగా నిర్వహించనున్నారు) పూర్తి వివరాలకు వివరములకు డా.విశ్వనాథ మహర్షి, అయుర్వేద స్పెషలిస్టు సెల్ నెం : 9849574706 సంప్రదించగలరని తెలిపారు.

# దళితుల పక్షపాతి వజ్రేష్ యాదవ్

**- బహుజనుల సమస్యలపై మాట్లాడే నాయకుడిపై విమర్శలు తగవు**

**- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వైఖరిని ఖండించిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రాపోలు ఉపేందర్**



బోడుప్పల్,ఆగస్ట్ 19(విజన్ ఆంధ్ర) : బహుజనుల కోసం పోరాడుతున్న తోటకూర వజ్రేష్ యాదవ్‌పై విమర్శలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రాపోలు ఉపేందర్ అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ఆయన, దళితులు, బహుజనుల సమస్యలపై నిరంతరం స్పందిస్తున్న మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్‌పై అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.వజ్రేష్ యాదవ్ దళితులు, బహుజనుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బహుజనుల కోసం మాట్లాడుతున్నామని చెప్పుకునే వారు వాస్తవంగా వారి సమస్యలపై ఎంతవరకు పోరాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.బహుజనులను మరిచి గడీలకు ఊడిగం చేసే రాజకీయాలను ప్రజలు ఇకపై సహించరు. దళితులు, బహుజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే తగిన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇకనైనా వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండి బహుజనుల సమస్యలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. బహుజన సమాజం ఐక్యతను దెబ్బతీసే వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# నూతన గ్రామ పంచాయతీ కార్యాలయంను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండల పరిధిలోని జిల్లెడ బండ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై



నూతన పంచాయతీ కార్యాలయం భవనాన్ని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కి సర్పంచ్ శాలువా కప్పి , పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి కొరకు కృషి చేయడం జరుగుతుంది. ప్రతి గ్రామాలకు అభివృద్ధి చెందాలని గ్రామాలలో మౌలిక సదుపాయాలు పచ్చదనం పరిశుభ్రత, పారిశుధ్య ఉండేవిధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుంది అని తెలిపారు. గ్రామాలలోని ప్రజలకు సమస్యలను పరిష్కరించి గ్రామపంచాయతీ కార్యాలయాలను ఏర్పాటుచేసి గ్రామంలోని ప్రజలకు సమస్యలను పరిష్కరించే విధంగా సులభంగా ప్రజలకు అందుబాటులో సర్పంచ్, కార్యదర్శి ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరం గ్రామాభివృద్ధి చేయాలని తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం గతంలో గ్రామాల అభివృద్ధికి కృషి, చిన్న గ్రామపంచాయతీలైనా కూడా గ్రామపంచాయతీ భవనాలను ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రజలకు పరిపాలన సులభంగా ఉండేటట్లు చేయాలని అన్నారు. అందేవిధంగా ప్రజలకు సమస్యలను గ్రామపంచాయతీ భవనంలో పరిష్కరించే విధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గ్రామ అభివృద్ధికి చేయడం జరుగుతుందని, భవిష్యత్తులో కూడా ఎమ్మెల్యే సహాయ సహకారాలు మా గ్రామానికి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగేష్ నాయడు, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, సత్య రెడ్డి, మాజీ ఎంపీపీ, నాయకులు రమేష్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్, కిట్టు, ఎంపీడీవో శైలజ, పంచాయతీ సెక్రెటరీ కవిత, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ను సన్మానించిన ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్



అలంపూర్ ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఇటీవల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజీవ్ గాంధీ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన వనపర్తి జిల్లాకు చెందిన రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ని ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ యాదవ్ కి అభినందనలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని సంపత్ కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య , గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# "లంచం డిమాండ్ చేసిన అధికారిపై ఏసీబీకి ఫిర్యాదు"



- "రెడ్ హ్యాండెడ్ గా పట్టుకునేందుకు ట్రాప్ సిద్ధం"
- "కల్వకుర్తిలో అవినీతిపై ఏసీబీ ఫోకస్"






ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 19: కల్వకుర్తి పట్టణంలోని ఓ ప్రభుత్వ శాఖలో లంచం కక్కుర్తి బట్టబయలైంది. పని కోసం వచ్చిన బాధితుడిని "భారీ మొత్తంలో డబ్బులు ఇవ్వు... లేకుంటే నీ ఫైల్ ఎప్పటికీ కదలదు" అంటూ అధికారి బెదిరించడంతో బాధితుడు నేరుగా ఏసీబీ డి.ఎస్.పి ని ఆశ్రయించాడు.

**గతంలోనూ ముట్టజెప్పాడు... ఇప్పుడు మరింత డిమాండ్**

ఫిర్యాదులో బాధితుడు సంచలన విషయాలు చెప్పాడు. "గతంలో కూడా కొంత డబ్బులు ఇచ్చాను. అయినా పని చేయలేదు. ఇప్పుడు ఇంకా ఎక్కువ అడుగుతున్నాడు" అని ఏసీబీకి వెల్లడించినట్లు సమాచారం.

**"మొఖా చూసి రైడ్ చేస్తాం"**

ఫిర్యాదు అందుకున్న వెంటనే ఏసీబీ అధికారులు యాక్షన్ లోకి దిగారు. "అడిగినన్ని డబ్బులు ఇవ్వు. మేము వచ్చి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంటాం" అని బాధితుడికి స్పష్టం చేశారు. ఏసీబీ అధికారులు ట్రాప్ ప్లాన్ చేస్తున్నారు. డబ్బులు ఇచ్చే సమయంలోనే అధికారిని పట్టుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఒక్కడిపై ఫిర్యాదు... ముగ్గురిపై నిఘా**

ఆసక్తికరమైన విషయం ఏంటే ఒక్క అధికారిపై ఫిర్యాదు చేయడానికి వెళ్తే, ఆ శాఖలోని ఇద్దరు ముగ్గురు అధికారుల అవినీతి వ్యవహారాలపై కూడా ఏసీబీ ఆరా తీస్తోందని సమాచారం.

**కల్వకుర్తిపై ప్రత్యేక నిఘా**

గత కొంత కాలంగా కల్వకుర్తిలో అవినీతి ఆరోపణలు ఎక్కువగా వస్తుండటంతో ఏసీబీ ప్రత్యేకంగా కల్వకుర్తిపై ఫోకస్ పెట్టింది. "లంచం అడిగే ఏ అధికారినైనా వదిలిపెట్టం. రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని జైలుకు పంపుతాం"లి అని ఏసీబీ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ వార్త తెలిసిన వెంటనే కల్వకుర్తిలోని అవినీతి అధికారుల్లో గుబులు మొదలైంది. ఫైళ్ల కోసం డబ్బులు అడిగేవారు ఇప్పుడు ఆఫీసులకు రావడానికి కూడా భయపడుతున్నారని టాక్.



**ప్రజలకు సూచన**

లంచం అడిగితే భయపడవద్దు. వెంటనే లిఏసీబీ టోల్ ఫ్రీ 1064లి కి ఫిర్యాదు చేయండి. ఫిర్యాదుదారుడి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంటాయి.

# "హరిద్ర గణపతిని అలా వదిలేయొద్దు"

- "పూజ తర్వాత పసుపు వినాయకుడికి ఇలా గౌరవం ఇవ్వాలి"
- "మంగళసూత్రాలకు పూస్తే సౌభాగ్యం"



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 18: హిందూ సంప్రదాయంలో ఏ శుభకార్యం చేసినా, ఏ వ్రతం పూజ చేసినా ముందుగా ప్రథమ పూజ వినాయకుడికే చేయడం ఆచారం. అందుకే ఇంట్లో చిన్న పూజ అయినా సరే ముందుగా పసుపుతో చిన్న గణపతిని తయారు చేసి, విఘ్నాలు తొలగించమని మొక్కుకుంటాం. ఆ పసుపు గణపతినే మన ఇంటికి వచ్చే ఆటంకాలను తొలగించి, పూజను నిర్విఘ్నంగా జరిగేలా చూస్తాడని భక్తుల నమ్మకం. కానీ పూజ పూర్తయిన తర్వాత ఆ పసుపు గణపతిని ఏం చేయాలనే విషయంలో చాలా మందికి సందేహాలు ఉంటాయి. కొందరు అలాగే వదిలేస్తారు. మరికొందరు స్నానం చేసే ముందు మొహానికి రాసుకుంటారు. ఇది సరైన పద్ధతేనా అంటే వేద పండితులు చెప్పే మాట వేరుగా ఉంది. పూజ పూర్తయిన వెంటనే ముందుగా ఆ పసుపు గణపతి ముందు మనసు నిండా ప్రార్థించాలి. స్వామీ ఈ పూజలో ఏమైనా తప్పులు ఉంటే క్షమించు. వచ్చే శుభకార్యాల్లో, పూజల్లో మళ్లీ నీ పూజ చేసుకునే భాగ్యం కలిగించు. అప్పటి వరకు మమ్మల్ని చల్లగా చూడు అని కోరుకుంటూ, ఆ పసుపు గణపతిని ఉంచిన తమలపాకును తూర్పు దిశగా నెమ్మదిగా కదిలించాలి. ఆ తర్వాత ఇంట్లో చేసే మిగిలిన పూజలన్నీ పూర్తి చేయాలి. అన్ని పూజలు అయిపోయిన తర్వాత ఆ హరిద్ర గణపతిని సాధారణ పసుపుగా చూడకూడదు. దాన్ని ప్రసాదంగా భావించి భక్తితో ఇంట్లోని దేవుడి గదిలో భద్రపరచాలి. వెంటనే వాడేయాల్సిన అవసరం లేదు. కొన్ని రోజులు అలా ఉంచిన తర్వాత మంచి రోజు చూసుకోవాలి. అందులోనూ మైల లేని రోజు అయితే ఇంకా మంచిది. ఆ రోజు ఇంట్లోని పుణ్య స్త్రీలు ఆ పసుపును తీసుకుని ముఖానికి రాసుకోవచ్చు. ఇది ఎంతో శుభప్రదంగా భావిస్తారు. అలాగే మంగళ సూత్రాలకు పూసుకుంటే సౌభాగ్యం వృద్ధి అవుతుందని పండితులు చెబుతారు. కానీ ఒక విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. ఆ పసుపును ఎట్టి పరిస్థితుల్లోనూ కాళ్లకు, చేతులకు, శరీరానికి లేదా పాదాలకు పూసుకోకూడదు. ఎందుకంటే అది పూజలో ఉపయోగించిన పవిత్ర వస్తువు. ఒకవేళ పూసుకోవడం కుదరని పరిస్థితి ఉంటే దాన్ని అగౌరవంగా చెత్తలోనో, తొక్కుడు పడే చోటనో పడేయకూడదు. అలా చేయడం దోషం. బదులుగా ఇంట్లోని బావిలో నిమజ్జనం చేయడం చాలా మంచిది. బావి లేని వారు ఇంటి దగ్గర ఉన్న పచ్చని చెట్ల మొదట్లో ఉంచి నీళు పోయవచ్చు. ప్రకృతిలో కలిపేయడం కూడా ఒక రకంగా నిమజ్జనమే. పండితులు చెప్పే మాట ప్రకారం పసుపు గణపతిని ఇలా గౌరవంగా ఉపయోగించినా, లేదా సరైన పద్ధతిలో నిమజ్జనం చేసినా వినాయకుడి కృప మనపై ఉంటుంది. మనకు వచ్చే ఎన్నో సమస్యలు దరిచేరవు. ఇంట్లో సుఖశాంతులు, సౌభాగ్యం నిలుస్తుంది. అందుకే ఇకపై ప్రతి ఒక్కరూ పూజలో ఉపయోగించిన పసుపు గణపతిని నిర్లక్ష్యం చేయకుండా శాస్త్రం చెప్పిన విధంగా గౌరవించాలి.

# ఉర్సు ఉత్సవాలకు ముస్తాబు

- ఈ నెల 26 నుంచి ప్రారంభం
- దర్గా పీఠాధిపతి మహ్మద్ అబీద్ హుస్సేన్ సత్తరూల్ ఖాద్రీ సహేబ్




పుల్కల్ మండలం సింగూరు లోని హజ్రత్ మహ్మద్ ఫీర్ బాబాన్ షా వలీ దాదా హజత్ 81వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 26, 27, 28 తేదీల్లో వైభవంగా జరగనున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉర్సు ఉత్స వాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సహేబ్ తెలిపారు. ఈ ఉత్సవాలకు కులమ తాలతకు అతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొం టారని ఆయన తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరించమన్నారు. 26వ తేదీన గంధం, చాదర్ ఇంటి నుండి తీసుకొని దర్గా లోకి తీసికెళ్లి కీలక ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. 27వ తేదిన కబడ్డీ పోటీలు సాయి కుమార్ సమక్షం లో నిర్వహిస్తామన్నారు. అదే రోజు సాయంత్రం నాతే మై ఫీల్ సమ మరియు అన్నదాన కార్య క్రమం ఉంటుదన్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతి థులుగా అన్నసాగర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ సుఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# స్వామివారి సేవలో విజన్ ఆంధ్ర దినపత్రిక చైర్మన్

యాదగిరిగుట్ట, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో విజన్ ఆంధ్ర దినపత్రిక చైర్మన్ జక్కుల నరేందర్, నెట్‌వర్క్ ఇన్‌చార్జ్ మహేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం యాదాద్రి క్షేత్రాన్ని సందర్శించిన వారు ప్రధానాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా స్వామివారి క్షేత్ర విశిష్టత, ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య పూజలు, సేవల వివరాలను వారు తెలుసుకున్నారు. యాదాద్రి క్షేత్రంలోని ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయ నిర్వహణ తీరుపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.





**ప్రజా సమస్యలపై కలం కదపాలి**



అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా విలేకరుల ఆత్మీయ సమావేశం యాదగిరిగుట్ట విలేకరి మీస వెంకటేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జక్కుల నరేందర్ మాట్లాడుతూ. జర్నలిస్టులు ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. వార్తల సేకరణలో వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించాలని అన్నారు. మారుతున్న మీడియా రంగానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని వృత్తిలో ముందుకు సాగాలని సూచించారు. విలేకరుల సమస్యలు, వృత్తిపరమైన అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో ఆంజనేయులు, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో నాగేల్లి వలి,వివిధ మండలాలకు చెందిన విలేకరులు పాల్గొన్నారు.

# పుణె జిల్లాలో దారుణ ఘటన

- బాలికపై అత్యాచార యత్నం...హత్య
- యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



పుణె,ఆగస్ట్19 : మహారాష్ట్రలోని పుణె జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 9 ఏళ్ల బాలికపై పొరిగింటి వ్యక్తి అత్యాచారం చేసి హత్యకు పాల్పడ్డాడు. ఆ పొరుగింటి 25 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని, కేసును త్వరితగతిన విచారించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు పుణె–నాసిక్ జాతీయ రహదారిని దిగ్బంధించారు పుణె జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాధిత బాలిక నాలుగో తరగతి చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. మంగళవారం అనారోగ్యంగా ఉండటంతో బాలిక పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయింది. మధ్యాహ్న సమయంలో తల్లిదండ్రులు ఇంట్లో లేని విషయాన్ని తెలుసుకున్న నిందితుడు బాలికను లైంగికంగా వేధించాడు. అనంతరం గొంతు నులిమి హత్య చేశాడు బాలిక ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కలిసి పరిసర ప్రాంతాల్లో గాలించారు. గంటల పాటు వెతికినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆ బాలిక కోసం కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి నిందితుడు కూడా వెతికాడు. దర్యాప్తులో భాగంగా పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి కనిపించాడు. వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అతడు నేరాన్ని అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు ఓ వాగు సమీపంలోని చెట్టు కింద బాలిక మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఘటనాస్థలాన్ని ఫోరెన్సిక్ బృందం పరిశీలించి కీలక ఆధారాలను సేకరించింది. నిందితుడికి మరణశిక్ష విధించాలని, కేసును త్వరితగతిన విచారించాలని బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.


# పాత్రికేయులతో ఆత్మీయంగా ముచ్చటించిన జక్కుల నరేందర్



సూర్యాపేట ఆగస్టు 19:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక ఎడిటర్ జక్కుల నరేందర్ హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా పత్రిక ప్రతినిధులు, పాత్రికేయులకు అక్రిడేషన్ కార్డులను అందజేసి ఆయన ఆత్మీయంగా ముచ్చటించారు. పత్రిక అభివృద్ధి, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల బాధ్యత తదితర అంశాలపై చర్చించారు. మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రజలకు వాస్తవాలను చేరవేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, నిష్పక్షపాతమైన వార్తా కథనాలతో ప్రజల పక్షాన నిలవాలని జక్కుల నరేందర్ పేర్కొన్నారు. పత్రిక ప్రతినిధుల కృషిని అభినందిస్తూ భవిష్యత్తులో మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆత్మీయ సమ్మేళనంలో మేనేజింగ్ ఎడిటర్ ఏ మహేష్, ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో అంజయ్య, సూర్యాపేట జిల్లా బ్యూరో సంకరమద్ది సుధీర్ రెడ్డి,స్టాఫర్ రాము,మామిడి శ్రవణ్ కుమార్,సైదులు, సుందరయ్య, రామకృష్ణ, మండల పాత్రికేయులు, పత్రిక ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ కమిషనర్లకు ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కాంక్లేవ్ కు ఆహ్వానం

హైదరాబాద్,ఆగస్టు,19: ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈనెల 21,22 తేదీలలో జరిగే జాతీయ సదస్సుకు జి.హెచ్.ఎం.సి కమిషనర్ కర్ణన్, హెచ్.ఎం.డి.ఏ కమిషనర్ సర్ఫరాజ్ అహమ్మద్ ను హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి కలిసింది.బుధవారం నాడు ప్రెస్ క్లబ్స్ అఫ్ ఇండియా ఫెడరేషన్ సీ.ఈ.ఓ వివేక్ ముఖర్జీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏ. రాజేష్,జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దెల్లి బాపురావు, కోశాధికారి రమేష్ వైట్ల జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ను ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు. ప్రెస్ క్లబ్స్ అఫ్ ఇండియా ఫెడరేషన్ జాతీయ సదస్సుకు రావాలని ఆహ్వానించారు. అనంతరం నానక్ రామ్ గూడా లోని హెచ్.ఎం.డి.ఏ కార్యాలయంలో కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ గారిని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్





వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దెల్లి బాపు రావు, ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ముత్యాల సత్తిబాబు తదితరులు కలిసి ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కాంక్లేవ్ కు ఆహ్వానించారు. హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ గారిని మర్యాదపూర్వకంగా శాలువతో సత్కరించారు. ఇదే సందర్భంగా ఆహ్వాన పత్రాన్ని ప్రెస్ క్లబ్ పాలకమండలి బృందం అందజేసింది. జాతీయస్థాయిలో జరిగే ఈ సదస్సుకు తప్పకుండా హాజరవుతానని సర్ఫరాజ్ వెల్లడించారు. దేశంలోని ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మొట్టమొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ జాతీయ సదస్సు విజయవంతం కావాలని సర్ఫరాజ్ ఆకాంక్షించారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.